విశాఖపట్టణం
సోమవారం 19 అక్టోబర్ 2026
For a pure tomorrow..
epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 248 వెల: రూ.5/- పేజీలు: 8
Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## బరిలో రెబల్స్.. ఇండిపెండింట్లు

పూర్తిస్థాయిలో అభ్యర్థులను ప్రకటించలేని పార్టీలు

అధిష్టానం సూచనలతో పలువురు నామినేషన్లు

గందరగోళంగా ముగిసిన నామినేషన్ల ఘట్టం

స్క్రూట్నీ, ఉపసంహరణ తర్వాతే పోటీదారులపై స్పష్టత

2

# విశాఖ డేటా సెంటర్లలో
# ఎయిర్ కూలింగ్ టెక్నాలజీ

ఒలింపిక్ పూల్ పరిమాణం కంటే తక్కువగా మంచినీటి వినియోగం

ముడసర్లొవ రిజర్వాయర్‌కు మురుగునీరు విడుదల చేయబోం

ఆదానీ, గూగుల్ వర్గాలు వెల్లడి



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో విశాఖపట్నాన్ని కీలక కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో చేపడుతున్న డేటా సెంటర్ ప్రాజెక్టుల్లో నీటి వినియోగాన్ని తగ్గించేందుకు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నట్లు అదానీ, గూగుల్ ప్రాజెక్టు వర్గాలు వెల్లడించాయి. గూగుల్ భాగస్వామ్యంతో అదానీ కనెక్స్ అభివృద్ధి చేస్తున్న డేటా సెంటర్ క్యాంపస్‌లలో నీటి ఆధారిత ఆవిరీకరణ శీతలీకరణకు బదులుగా ఎయిర్ కూలింగ్ వ్యవస్థలను ఉపయోగించనున్నట్లు తెలిపాయి. ముడసర్లొవ, తాళ్లవాడ ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఈ డేటా సెంటర్ అభివృద్ధి ప్రణాళిక సుమారు ఒక గిగావాట్ సామర్థ్యంతో రూపొందుతోంది. మూడు క్యాంపస్‌లలో కలిపి మంచినీటి వినియోగాన్ని ఒలింపిక్ సైజు స్విమ్మింగ్ పూల్‌లో పట్టే నీటి పరిమాణం కంటే తక్కువగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రాజెక్టు వివరాలు సూచిస్తున్నాయి.

**మురుగునీటి పునర్వినియోగానికి ప్రణాళిక**

డేటా సెంటర్ల నుంచి వెలువడే దేశీయ మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేలా జీరో డిశ్చార్జ్ విధానాన్ని అమలు చేయనున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రాంగణంలోనే మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి, శుద్ధి చేసిన నీటిని పచ్చదనం పెంపు, మొక్కలకు నీరు పెట్టడం, ..మిగతా 2లో



ఎస్ఈసీ చంద్రబాబు

## వీరవిధేయుడు

నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగే అవకాశం లేదు

కూటమి అరాచకాలకు అంతే లేదు

టీడీపీ గూండాల్లా పోలీసులు తయారయ్యారు

వైసీపీ ఆభ్యర్థులపై రాళ్లు రువ్వుతున్నారు

ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం

వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మండిపాటు

(తాడేపల్లి - జయజయహే)

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ సాగుతున్న తీరుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రిజర్వేషన్లు ప్రకటించిన వెంటనే కనీసం ఎస్ఐఆర్ ప్రక్రియ కూడా పూర్తి చేయకుండా నోటిఫికేషన్ విడుదల చేశారని ఆయన విమర్శించారు. అధికార కూటమి ముందస్తుగానే తమ అభ్యర్థులను, రిజర్వేషన్లను సెట్ చేసుకున్న ..మిగతా 2లో

# మహిళలే నిర్ణేతలు..!

కార్పొరేషన్, మున్సిపాల్టీలో మహిళా ఓటర్లే అధికం

విజేతలను శాసించే స్థాయిలో ఓటు బ్యాంక్

అన్ని కార్పొరేషన్లలో మహిళ ఓటర్లే కింగ్ మేకర్స్

(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలోని నగర, పురపాలక ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకంగా మారనున్నారు. ఈ నెల 28న జరగనున్న 100 పట్టణ స్థానిక సంస్థల (మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, నగరపాలక సంస్థలు) ఎన్నికల్లో పురుషుల కంటే అతివల ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. మొత్తం ఓటర్లలో పురుషుల కంటే మహిళలు 2.77 శాతం ఎక్కువగా ఉన్నారు. మొత్తం 100 పట్టణ స్థానిక ..మిగతా 2లో



## పంతంగి వద్ద పండుగ రద్దీ

హైదరాబాద్ - విజయవాడ హైవే ఫుల్ రష్

24 గంటల్లో 52, వేల వాహనాల ప్రయాణం

(విజయవాడ - జయజయహే)

దసరా పండుగ, సెలవుల నేపథ్యంలో హైదరాబాద్–విజయవాడ హైవేపై భారీగా వాహనాలు వెళ్తున్నాయి. సగటున నిమిషానికి 36 వాహనాలు ప్రయాణించినట్టుగా అధికారులు తెలిపారు. శనివారం నాడు పంతంగి టోల్ ప్లాజా వద్ద నిమిషానికి సగటున 36 వాహనాలు ప్రయాణించాయి. దసరా పండుగల రద్దీ కారణంగా హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ..మిగతా 2లో





పులివెందులలో

## 562 మందిపై కేసులు

రాళ్లదాడులు, ఘర్షణలపై పోలీసు చర్యలు

(కడప - జయజయహే)

పులివెందులలో శనివారం చోటుచేసుకున్న ఘర్షణలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు 562 మంది వైఎస్సార్సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. పోలీసులపై దాడుల ఘటనను అధికారులు తీవ్రంగా పరిగణించారు. మరోవైపు పులివెందులలో పోలీసుల నిఘా, భద్రతా చర్యలు కొనసాగుతున్నాయి. శనివారం ఎంపీ అవినాశ్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్సీపీ శ్రేణులు చేసిన అరాచకంతో పులివెందుల రణరంగంగా మారింది. నామపత్రాల దాఖలు సందర్భంగా టీడీపీ అభ్యర్థి నామినేషన్ వేసేందుకు కార్యాలయానికి వచ్చారు. తెలుగుదేశం అభ్యర్థి నామపత్రాల ప్రక్రియ కొనసాగుతుండగానే ఎంపీ అవినాశ్‌రెడ్డి నేతృత్వంలో ఆ పార్టీ కార్యకర్తలు వందలాదిగా తరలివచ్చారు. తాము లోపలికి వెళ్లి, తమ అభ్యర్థితో నామినేషన్ వేస్తామని ..మిగతా 3లో

## సోషల్ మీడియాలో ప్రచార హోరు

ఇంటింటికి వెళ్లే ప్రచారానికి నో టైమ్

ఇన్ స్టా, ఫేస్ బుక్ రీల్స్ లో క్యాంపెయిన్

రోజులో పదిసార్లు మొబైల్లో ప్రత్యక్షం.. డిజిటల్ యుగంలో కొత్త ట్రెండ్

స్థానిక ఎన్నికల్లో సరికొత్త ఎత్తుగడలు



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నామినేషన్ల దాఖలుకు గడువు ముగుస్తుండటంతో క్షేత్రస్థాయిలో రాజకీయ ముఖచిత్రం శరవేగంగా మారుతోంది. ఒకవైపు ప్రచారానికి పట్టుమని వారం రోజుల సమయం కూడా లేకపోవడం, మరోవైపు రానున్న 3 రోజులపాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. కాలి నడకన ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం కష్టంగా మారింది. కాగా ఈ నేపథ్యంలో అభ్యర్థులు ..మిగతా 3లో

## మీ పిటీషన్ నిరర్థకం

నామినేషన్ గడువు ముగిసింది

షెడ్యూల్ వచ్చాక ఏం చేయలేం.. వైసీపీ పిటీషన్ పై హైకోర్టు వ్యాఖ్యలు

2

కూటమి మేయర్

## అభ్యర్థుల నామినేషన్

విజయవాడలో వంగవీటి రాథా దాఖలు

విశాఖలో ముక్కా శ్రావణి పత్రాలు సమర్పణ

2



For a pure tomorrow.. జయహో

# బరిలో రెబల్స్.. ఇండిపెండింట్‌లు

## పూర్తిస్థాయిలో అభ్యర్థులను ప్రకటించలేని పార్టీలు

## అధిష్టానం సూచనలతో పలువురు నామినేషన్లు

## గందరగోళంగా ముగిసిన నామినేషన్ల ఘట్టం

## స్క్రూట్నీ, ఉపసంహరణ తర్వాతే పోటీదారులపై స్పష్టత

(అమరావతి - జయజయహే)




పురపాలక ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఘట్టం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారంతో పూర్తయింది. చివరి రోజైన ఆదివారం మధ్యాహ్నం 3.00 గంటల సమయానికి రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద వరుసలో ఉన్న అభ్యర్థులందరి పత్రాలను అధికారులు స్వీకరించారు. అంతిమ గడువు ముగియడంతో అన్ని ప్రధాన పార్టీల మద్దతుదారులు, స్వతంత్ర అభ్యర్థులు భారీ సంఖ్యలో నామినేషన్లు సమర్పించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం అక్టోబర్ 19న అధికారులు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాల పరిశీలన చేపడతారు. పోటీ నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులకు అక్టోబర్ 21వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు అవకాశం కల్పించారు. అదే రోజు సాయంత్రం బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. అక్టోబర్ 28న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ నిర్వహిస్తారు. అక్టోబర్ 30వ తేదీన ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలలో (13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు) మొత్తం 3,942 కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్ల స్వీకరణ పూర్తవడంతో అభ్యర్థుల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అర్బన్ స్థానిక పోరు ముగిసిన వెంటనే, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన తదుపరి దశల పోలింగ్ ప్రక్రియ వరుసగా ప్రారంభం కానుంది.

### ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్

రెండో దశ కింద ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబర్ 19న వస్తుంది. నామినేషన్ల తుది గడువు 23, నామినేషన్ల ఉపసంహరణ 27 వరకు ఉంటుంది. పోలింగ్ తేదీ నవంబర్ 3 ఉండగా.. ఫలితాలు నవంబర్ 5న వెల్లడిస్తారు.

### మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు

గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం మూడు విడతల్లో పంచాయతీ పోలింగ్ నిర్వహించనున్నారు. పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ పూర్తయిన రోజు సాయంత్రమే ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.

**తొలి విడత**

నోటిఫికేషన్: నవంబరు 13

నామినేషన్ల గడువు: నవంబరు 17 (ఉపసంహరణ: నవంబరు 21)

పోలింగ్ & లెక్కింపు: నవంబరు 26

**రెండో విడత**

నోటిఫికేషన్: నవంబరు 18

నామినేషన్ల గడువు: నవంబరు 20 (ఉపసంహరణ: నవంబరు 24)

పోలింగ్ & లెక్కింపు: నవంబరు 29

**మూడో విడత**

నోటిఫికేషన్: నవంబరు 19

నామినేషన్ల గడువు: నవంబరు 23 (ఉపసంహరణ: నవంబరు 27)పోలింగ్ & లెక్కింపు: డిసెంబరు 2



# కూటమి మేయర్ అభ్యర్థుల నామినేషన్

## విజయవాడలో వంగవీటి రాధా దాఖలు

## విశాఖలో ముక్కా శ్రావణి పత్రాలు సమర్పణ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికలు ఎప్పుడూ హాట్ హాట్‌గా జరుగుతుంటాయి. ఈసారి వంగవీటి రాధాకృష్ణ, రాయని భాగ్యలక్ష్మీ మధ్య పోటీ ఉంటుందని అంతా భావించగా అనూహ్యంగా రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు రంగంలోకి దిగారు. ఆయనకు వామపక్షాలతో పాటు కాంగ్రెస్ మద్దతు తెలపడం ప్లస్ పాయింట్ అయింది. దాంతో విజయవాడ మేయర్ ఎన్నికలు ముక్కోణపు పోరుగా మారుతున్నాయి. ఈ క్రమంలో కూటమి తరపున మేయర్ అభ్యర్థిగా ప్రకటించిన వంగవీటి రాధాకృష్ణ ఆదివారం తన నామినేషన్‌ను దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతూ, ముందుగా తనకు మద్దతుగా నిలిచిన మెగాస్టార్ చిరంజీవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా కూటమి పెద్దలందరి ఆమోదంతోనే తనను విజయవాడ మేయర్ అభ్యర్థిగా ఖరారు చేశారని వంగవీటి రాధా తెలిపారు. రాష్ట్ర రాజకీయాలకు రాజధానిగా పిలుచుకునే విజయవాడ నగరానికి మేయర్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం రావడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. విజయవాడ సిటీలో 3 భాగస్వామ్య పార్టీల నేతలు, కార్యకర్తలు ఎంతో సమన్వయంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల పూర్తి సహకారంతో పాటు విజయవాడ పరిధిలోని ముగ్గురు ఎమ్మెల్యేలను కలుపుకుని పోతూ నగరాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామని వంగవీటి రాధా ధీమా వ్యక్తం చేశారు. విజయవాడ సిటీకి మంచి పేరు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీ కీలకమైన విజయవాడ మేయర్ స్థానానికి బీసీ మహిళను అభ్యర్థిగా ప్రకటించారు. రాయని భాగ్యలక్ష్మీ ఆదివారం నాడు విజయవాడ మేయర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఆమె వెంట దేవినేని అవినాష్, పలువురు పార్టీ నేతలు నామినేషన్ కేంద్రానికి వెళ్లారు.

### విశాఖలో ముక్కా శ్రావణి నామినేషన్

మరో వైపు గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ కు సంబంధించి కూటమి మేయర్ అభ్యర్థిగా ముక్కా శ్రావణి నామినేషన్ దాఖలు చేసారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయానికి ఆమె ర్యాలీగా తరలి వచ్చారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి నామినేషన్ పత్రాలు సమర్పించారు.



# పంతంగి వద్ద పండుగ రద్దీ

మొదటి పేజీ తరువాయి...

ట్రాఫిక్ గణనీయంగా పెరిగి 24 గంటల్లో 52,000 వాహనాలు ఈ మార్గం గుండా వెళ్లాయి. పది రోజుల క్రితం ఇదే సమయంలో సుమారు 37,000 వాహనాలు మాత్రమే నమోదయ్యాయి. పండుగ సీజన్ కావడంతో హైదరాబాద్ నుండి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పట్టణాలకు ప్రయాణించే వారి సంఖ్య భారీగా పెరిగింది. దీనివల్ల టోల్ ప్లాజా వద్ద, రహదారికి ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి, ట్రాఫిక్ చాలా నెమ్మదిగా సాగింది. ఇప్పటికీ అదే పరిస్థితి ఉంది. టోల్‌ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదలడంతో జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టోల్ ప్లాజా అధికారుల తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 17 అర్ధరాత్రి నుండి అక్టోబర్ 18 అర్ధరాత్రి వరకు పంతంగి టోల్ ప్లాజా మీదుగా రెండు వైపులా కలిపి మొత్తం 52,000 వాహనాలు ప్రయాణించాయి. అంటే గంటకు సగటున సుమారు 2,167 వాహనాలు రాకపోకలు సాగించాయి. శుక్రవారం నాడు 49,000 వాహనాలు, అక్టోబర్ 7న సుమారు 37,000 వాహనాలు నమోదవ్వగా, తాజా గణాంకాలు పది రోజుల్లోనే రోజువారీ ట్రాఫిక్‌లో 40.5 శాతం పెరుగుదల కనిపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో ఇక్కడ సుమారు 30,000 నుండి 35,000 వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని అధికారులు తెలిపారు. గత వారం రోజులుగా ఈ సంఖ్య 40,000 వరకు ఉందని, గత రెండు రోజుల్లో ట్రాఫిక్ గణనీయంగా పెరిగిందంటున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ సమీపంలో ఉన్న పంతంగి టోల్ ప్లాజా, హైదరాబాద్‌ను విజయవాడతో కలిపే ముఖ్యమైనది. ఈ రహదారిపై ప్రైవేట్ కార్లు, టాక్సీలు, అంతర్రాష్ట్ర బస్సులు, వాణిజ్య వాహనాలు, భారీ సరుకు రవాణా వాహనాలు వెళ్తుంటాయి. ఇది తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌లోని అనేక పట్టణాలు, జిల్లాలతో ఇది కనెక్ట్ చేస్తుంది. పండుగ సీజన్‌లో సాధారణ వాణిజ్య వాహనాల రాకపోకలతోపాటు తమ సొంత ఊళ్లకు వెళ్లే కుటుంబాలు, ప్రయాణికుల ప్రైవేట్ కార్లు, బస్సుల సంఖ్య భారీగా పెరగడంతో ఈ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఎక్కువైంది. ప్రధాన రహదారిపై రద్దీని తగ్గించడానికి.. ట్రాఫిక్ పోలీసులు చౌటుప్పల్‌లోని లక్కారం నుండి కొన్ని వాహనాలను వలిగొండ మీదుగా చిట్యాల వైపు మళ్లించినట్లుగా తెలుస్తోంది. పండుగ కాలంలో ట్రాఫిక్ ఎంత తీవ్రంగా పెరిగిందో టోల్ ప్లాజా గణాంకాలను చూస్తే అర్థం చేసుకోవచ్చు. అక్టోబర్ 7వ తేదీన సుమారు 37,000 వాహనాలు దాటగా, అక్టోబర్ 16న 49,000, అక్టోబర్ 17 నాటికి 52,000 వాహనాలు దాటాయి.



# మీ పిటీషన్ నిరర్థకం

మొదటి పేజీ తరువాయి...

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ గడువు పెంచాలని వైసీపీ వేసిన అనుబంధ పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసింది. హౌస్ మోషన్ పిటిషన్‌పై న్యాయస్థానం ఆదివారం విచారణ జరిపింది. నామినేషన్ల గడువు ముగియడంతో ఇప్పుడు మీరు వేసిన పిటిషన్ నిరార్థకమైందని హైకోర్టు పేర్కొంది. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత జోక్యం చేసుకోకూడదని ఉన్న తీర్పులకు అనుగుణంగా వైసీపీ వేసిన అనుబంధ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఆయా జిల్లా కేంద్రాల్లో నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైసీపీ వేసిన పిటిషన్‌ను డివిజనల్ బెంచ్ అనుమతించింది. స్థానికంగా నామినేషన్లు వేయనివ్వని పక్షంలో ఈ ఎన్నికల్లో ఆయా జిల్లా కేంద్రాల్లో నామినేషన్ వేసుకునేందుకు వెసులుబాటు ఉంటుందని వైసీపీ సీనియర్ న్యాయవాది వాదించారు. ఈ విషయంపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను డివిజనల్ బెంచ్ ఆదేశించింది. ఈ విచారణను ఏపీ హైకోర్టు వాయిదా వేసింది.

## ఎస్ఈసీ చంద్రబాబు

# వీరవిధేయుడు

మొదటి పేజీ తరువాయి...

తర్వాత, వైఎస్సార్సీపీకి ఏమాత్రం సమయం ఇవ్వకుండా ఎన్నికల షెడ్యూల్ తెచ్చారని ఆరోపించారు. నామినేషన్లు దాఖలు చేస్తున్న తమ పార్టీ అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేయడం, వారిపై లాఠీచార్జ్ చేయడం దారుణమని మండిపడ్డారు. అధికారులు, రిటర్నింగ్ ఆఫీసర్లు నామినేషన్ పత్రాలను తీసుకోవడం లేదంటే రాష్ట్రంలో అసలు రాజ్యాంగబద్ధ పాలన, చట్టం, న్యాయం ఉన్నాయా లేదా అని ప్రశ్నించారు. డీజీపీ, హోంమంత్రి, ఎన్నికల సంఘం నిద్రపోతున్నాయని, పోలీసులు వైసీపీ అభ్యర్థులు, నాయకులపై దాడి చేస్తూ టీడీపీ నేతలకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో తమ వైఎస్సార్సీపీ పాలనలో స్థానిక ఎన్నికలు జరిగాయని, నాటి ఎస్ఈసీ నిమ్మగడ్డ ప్రసాద్ టీడీపీ కోసం కాళ్లకు బలపం కట్టుకుని తిరిగినప్పటికీ, ఎన్నికల కోడ్ రాగానే భారీ ఎత్తున పోలీసుల బదిలీలు జరిగినప్పటికీ, తాము చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఆధారంగానే 13 మున్సిపల్ కార్పొరేషన్లను వైఎస్సార్సీపీ స్వీప్ చేసిందని జగన్ గుర్తుచేశారు. కానీ నేడు చంద్రబాబు హయాంలో సూపర్ 6, సూపర్ సెవెన్ హామీలను గాలికి వదిలేసి, ప్రజలకు బాండ్లు ఇచ్చి ఎగ్గొట్టారని విమర్శించారు. ఎక్కడ చూసినా అవినీతి, 'రెడ్ బుక్' రాజ్యాంగమే కనిపిస్తోందని అన్నారు.

చంద్రబాబుకు నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిపే ధైర్యం లేకనే నామినేషన్లు వేసేందుకు వచ్చే తమ పార్టీ అభ్యర్థులను భయాందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో సీఎస్ విధులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి తొలగించిన మాజీ అధికారి అనిల్ చంద్ర పునేఠా చంద్రబాబుకు వీరవిధేయుడని, పదవీ విరమణ చేసినప్పటికీ ఆయనను మళ్లీ తెచ్చి ఎస్ఈసీగా నియమించారని, ఆయన చంద్రబాబు చెప్పినట్లు వినడం వల్లే రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియలో తీవ్ర అరాచకాలు జరుగుతున్నాయని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.



రాష్ట్రవ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల్లో చోటుచేసుకున్న ఘటనలను వివరిస్తూ.. పుంగనూరులో లోక్‌సభ ఫ్లోర్ లీడర్, ఎంపీ మిథున్ రెడ్డితో పాటు ఇతర వైఎస్సార్సీపీ నాయకులపై మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారని వైఎస్ జగన్ ఆరోపించారు. పూర్తి టీటోటలర్ అయిన ఎంపీ మిథున్ రెడ్డి కార్లలో మద్యం సీసాలు పెట్టి విషయాన్ని తిప్పికొట్టే కుట్రలు చేశారని, వారి వాహనాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. డీఎస్సీ స్కామ్‌లో ప్రధాన నిందితుడు, శాప్ ఛైర్మన్ రవి నాయుడు నామినేషన్ కేంద్రంలో పోలీసుల మైక్ తీసుకొని బెదిరింపులకు దిగుతుంటే పోలీసులు చేతులు కట్టుకుని చూశారని విమర్శించారు. ఎస్ఎమ్ నయాజ్ ఆయన భార్యతో కలిసి వెళ్తే పోలీసుల ముందే దాడి చేసి నామినేషన్ పత్రాలు లాక్కున్నారన్నారు.

తిరుపతిలో తమ మేయర్ అభ్యర్థి వాసు యాదవ్ నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారని, ఆయనకు మద్దతుగా వెళ్లిన ఎంపీ గురుమూర్తి చేతిలో ఉన్న పత్రాలను కూడా లాక్కున్నారని తెలిపారు. వాసు యాదవ్ తన తల్లితో కలిసి నిరసన తెలిపారని, అసలు వీళ్లు ప్రభుత్వానికా లేక చంద్రబాబు కోసమా పనిచేసేదని పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన ఒక కార్పొరేటర్ అభ్యర్థి కొడుకుపై కత్తి దాడికి కూడా తెగబడ్డారని వాపోయారు. కడప జిల్లా బద్వేల్‌లో టీడీపీ ఎమ్మెల్యే భర్త, ఇన్‌ఛార్జ్ సూర్యనారాయణరెడ్డి బెదిరింపులకు దిగుతూ.. ఆర్వో కార్యాలయంలోకి చొరబడి పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్సీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించేశారని జగన్ ఆరోపించారు. రాజంపేటలో మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మహిళ, ఆమె తండ్రిపై భౌతిక దాడులు చేశారని, మహిళలపై ఇలాంటి దాడులు చేయడానికి చంద్రబాబుకు సిగ్గులేదా అని ప్రశ్నించారు. దర్శిలోనూ తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని తెలిపారు. ఇక పులివెందులలో పరిస్థితి మరింత దారుణంగా మారిందని, అక్కడ జరుగుతున్న అరాచకాలపై ఎంపీ అవినాష్ రెడ్డి పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ, నామినేషన్ల కోసం వెళ్తున్న వైఎస్సార్సీపీ నేతలపై పోలీసులే స్వయంగా ఏకే-47 తుపాకీలతో ఫైరింగ్ చేశారని సంచలన ఆరోపణ చేశారు. టీడీపీ గూండాలు కర్రలు, రాడ్లు, వేటకొడవళ్లతో దాడులకు తెగబడటంతో పాటు పోలీసులే రాళ్లు విసురుతూ కార్లను ధ్వంసం చేశారని వైఎస్ జగన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



# మహిళలే నిర్ణేతలు..!

మొదటి పేజీ తరువాయి...

సంస్థల పరిధిలో 1,03,44,061 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 50,27,784 మంది ఉండగా, అతివలు 53,14,734 మంది ఉన్నారు. ఇతరులు 1,543 మంది ఉన్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకంగా మారనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సమకూర్చిన జాబితాల ఆధారంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఎన్నికల కమిషన్ ఇటీవల ఓటర్ల తుది జాబితాలను వార్డులు, డివిజన్ల వారీగా ప్రచురించింది. మొత్తం 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు గానూ ఏడు మున్సిపాలిటీల్లో ఓటర్ల సంఖ్య లక్ష దాటింది. నంద్యాల, ఆదోని, తెనాలి, గుంతకల్లు, మండపేట, ధర్మవరం, ప్రొద్దుటూరు పట్టణాల్లో లక్షకు పైగా ఓటర్లు ఉన్నారు. వీటిలో 1,99,238 మంది ఓటర్లతో నంద్యాల మున్సిపాలిటీ తొలి స్థానంలో ఉండగా, ఆదోని, తెనాలి తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక్కడ కూడా పురుషుల కంటే మహిళలదే పూర్తి ఆధిక్యం. ఏడు మున్సిపాలిటీల్లో లక్షకుపైగా ఓటర్లు: ఎన్నికలు నిర్వహిస్తున్న 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఏడు మున్సిపాలిటీల్లో లక్షకుపైగా ఓటర్లు ఉన్నారు. 1,99,238 మంది ఓటర్లతో నంద్యాల మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ఆదోని (1.76 లక్షలు), తెనాలి (1.57 లక్షలు) ఉన్నాయి. వీటిలోనూ అతివలదే ఆధిక్యం. నంద్యాలలో మొత్తం 1,99,238 ఓట్లలో పురుషులు 96,672, మహిళలు 1,02,488, ఇతరులు 78 మంది ఉన్నారు. ఆదోనిలో 1,76,676 ఓట్లలో పురుషులు 86,694, మహిళలు 89,946, ఇతరులు 36 మంది ఉన్నారు. తెనాలిలో మొత్తం 1,57,089 ఓట్లలో పురుషులు 75,522, మహిళలు 81,536, ఇతరులు 31 మంది ఉన్నారు. గుంతకల్లు, మండపేట, ధర్మవరం, ప్రొద్దుటూరులోనూ లక్షకుపైగా ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలోని 13 నగరపాలక సంస్థల్లో (కార్పొరేషన్లలో) ఎన్నికలు జరుగుతుండగా, తొలి ఆరు స్థానాల్లో ఉన్న బడా కార్పొరేషన్లలో మహిళలే అధికంగా ఉన్నారు. మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధిలో అత్యధికంగా 18,37,901 మంది ఓటర్లు ఉండగా, రెండో స్థానంలో విజయవాడ, ఆ తర్వాతి స్థానాల్లో గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి ఉన్నాయి. ఈ ఆరు నగరాల్లో ఎక్కడ చూసినా పురుషుల ఓట్ల కంటే మహిళల ఓట్లే వేల సంఖ్యలో అధికంగా ఉండటం విశేషం.

# వరుదు కళ్యాణి పట్ల విశాఖ ప్రజలు సానుకూలం

### 120 డివిజన్లలో వైసీపీ గెలుపే లక్ష్యం

### మహిళలకు 60 శాతం టికెట్లు..

### సేవాభావమే అభ్యర్థుల ఎంపికకు ప్రాతిపదిక

### వైసీపీ జిల్లా అధ్యక్షులు కేకే రాజు

**విశాఖపట్నం, అక్టోబర్ 18, జయ జయహే**



: జీవీఎంసీ ఎన్నికల్లో 120 డివిజన్లలోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బరిలోకి దించామని, రానున్న ఎన్నికల్లో మేయర్, కార్పొరేటర్ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వైసీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు తెలిపారు. నామినేషన్ల గడువు ముగిసిన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, ఒక్కో డివిజన్‌కు నాలుగు నుంచి పది దరఖాస్తులు వచ్చాయని, సేవాభావం, ప్రజలకు అందుబాటులో ఉండే తత్వాన్ని పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేశామని పేర్కొన్నారు. డివిజన్ల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారులో అడ్డగోలు విధానాలు అనుసరించారని విమర్శించిన ఆయన, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ తరఫున మహిళలకు 60 శాతం టికెట్లు కేటాయించామని, వెనుకబడిన వర్గాలకు 95 స్థానాలు, ఇతర వర్గాలకు 14 శాతం ప్రాతినిధ్యం కల్పించినట్లు వివరించారు. వరుదు కళ్యాణి అభ్యర్థిత్వానికి ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని కేకే రాజు తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖపట్నంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తామని చెప్పారు. నౌకాశ్రయ కాలుష్యం, రహదారుల సమస్యలపై తమ పార్టీ పోరాటం కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజల ముందుకు మేనిఫెస్టోను తీసుకెళ్లి, నగరాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై తమ విధానాలను వివరిస్తామని కేకే రాజు వెల్లడించారు. ఈ సమావేశంలో వైసీపీ నేతలు మళ్ల విజయ్ ప్రసాద్, డాక్టర్ జహీర్ అహ్మద్, పేడాడ రమణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# యు. చీడిపాలెంలో టీడీపీలోకి భారీగా చేరికలు..

**కొయ్యూరు, (జయ జయహే న్యూస్ ) అక్టోబర్ 19,**



కొయ్యూరు మండలంలోని యు.చీడిపాలెం పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి భారీ బలం చేకూరింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ వంపూరి చంద్రకళతో పాటు పలువురు వార్డు సభ్యులు, సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు.టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ మాజీ చైర్మన్ ఎం.వి.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న పాలనా సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై తాము తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వ విధానాలపై విశ్వాసంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎం.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీపై నమ్మకంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడమే పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.మాజీ సర్పంచ్ తో పాటు సుమారు 100 మంది టీడీపీలో చేరడం స్థానికంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

# దసరాను తలపించేలా సీతయ్యపేటలో దుర్గాష్టమి వేడుకలు







**బుచ్చియ్య పేట జయ జయహే**

బుచ్చయ్యపేట మండలం సీతయ్యపేట గ్రామంలో శ్రీ దుర్గా మల్లేశ్వర్ల అమ్మవారి ఆలయం వద్ద శరన్నవరాత్రులు మహోత్సవంలో భాగంగా ఆదివారం దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ భక్తులకు ఆకర్షణగా అమ్మవారు దర్శనమిచ్చారు. దుర్గాష్టమి పూజలు, కుంకుమ పూజలు, మరియు విష్ణు, లలిత, దుర్గా సహస్రనామాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిచ్చరు. అనంతరం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతములు ఆలయం ప్రయాణంలో నిర్వహించారు. మధ్యాహ్నం భారీగా 8000 మంది భక్తుల వరకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం దుర్గా మల్లేశ్వర్ల అమ్మవారి త్రిరువీధి కార్యక్రమము అంగరంగ వైభవముగా మేళతాళములతో, సన్నాయి మేళలతో ,సేవ గరిడీలతో ,తప్పుడు గుళ్ళతో, కోలాటంలతో, చిటికెలు భజనలతో, విద్యుత్ అలంకరణలతో భారీ బాణాసంచాతో అమ్మవారు ఊరేగింపుగా ఆత్యంత వైభవంగా నిర్వహిచ్చారు. అనంతరం అగ్నిగుండం తొక్కుటకు అధిక సంఖ్యలో భక్తులు తొక్కారు. ఈ తిరువీధి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో దసరాను తలాపిచ్చిలా ఉండదంతో గ్రామములో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరి చింది.

# పల్లెల్లో విద్యా నైపుణ్యాలకు ప్రతిభా పురస్కారాలు

### బాల్య దశ విద్యార్థులకు ప్రోత్సాహమే బలం ... మట్టిలో మాణిక్యాలకు మెరుగు పెట్టే వేదిక





**టెక్కలి అక్టోబర్ 18 జయ జయహే**

విద్యార్థి దశలోనే విలువైన ప్రోత్సాహం సమగ్ర సమాచారం అందించే విజ్ఞాన వేదిక కార్యక్రమాలు నిర్వహించి గ్రామీణ ప్రాంత విద్యార్థులను భాగస్వామ్యం చేయడం అందరూ హర్షించే మేలైన సమాజానికి పునాదులు వేయడం చాలా ఆనందదాయకమని గ్రామీణ ప్రాంతమైన చాకిపల్లిలో విద్యా వికాసానికి సంబంధిత కార్యక్రమం డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం నిర్వహించడం గొప్ప విషయమని పలువురు గ్రామ పెద్దలు ప్రశంసించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం చాకిపల్లిలో హాజరైన 5వ తరగతి వంద మంది విద్యార్థుల్లోని ప్రతిభ పాఠ వాలాను వెలికి తీసేందుకు విద్యా వికాసానికి ప్రోత్సహించే కార్యక్రమాన్ని గ్రామంలో డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం సారధ్యంలో సామూహిక పరీక్ష వేదిక ను నిర్వహించినట్లు కార్యక్రమం కన్వీనర్ మంతిని అప్పన్న తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి దాట్ల దాశరధి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల ప్రతిభ విద్యా వికాసానికి ప్రోత్సహించే గ్రామస్థాయి లో ఇటువంటి వేదికలు ఎంతో అవసరమని నిర్వాహకులకు విజేతలైన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు, ఇటువంటి ప్రజా ప్రయోజన కార్యక్రమాలను గ్రామాల్లో నిర్వహించాలని దాశరధి కొనియాడారు. ప్రతిభా పరీక్షలో ప్రధమ బహుమతిని గెలుపొందిన ఎంపీపీ పాఠశాల రాళ్ల పేట కు చెందిన మూల రోహిత్ సాయి, ద్వితీయ బహుమతి నందిగామ మండలం రాంపురం పాఠశాల కు చెందిన బమ్మిడి మోహన గౌర కృష్ణ, తృతీయ బహుమతి సంతబొమ్మాలి మండలం వడ్డీ వలస కు చెందిన హెచ్ హన్విక గెలుపొందారు. విజేతలకు నగదు , జ్ఞాపికలను పెద్దలు, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమక్షంలో పురస్కార సన్మానాలు చేశారు. పది స్థానాల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు, ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దాట్ల దాశరధి ముఖ్యఅతిథిగా పాల్గొనగా గ్రామ పెద్దలు పంగ తవి ట య్య, పంగ వసంత కుమార్, డాక్టర్ అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు మంతిని అప్పన్న, చంద్రశేఖర్, శాంతి కుమార్, కామరాజు, సింహాచలం, కిరణ్, అనిల్, పాపారావు, గోవిందరావు, దుర్గారావు, జానకిరామ్, హరి, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు స్థానికులు పాల్గొన్నారు.




# సోషల్ మీడియాలో ప్రచార హోరు

**మొదటి పేజీ తరువాయి...**

సాంప్రదాయ ప్రచారానికి స్వస్తి పలికి ఆధునిక డిజిటల్ వ్యూహాలకు తెరలేపారు. రోజులో 10 సార్లు ఓటర్ల మొబైల్ స్క్రీన్లపై ప్రత్యక్షం కావడమే లక్ష్యంగా సరికొత్త ప్రణాళికలు రచిస్తున్నారు.

ఈ డిజిటల్ సమరంలో అభ్యర్థులు సామాజిక మాధ్యమాలను తమ ప్రధాన అస్త్రంగా మలచుకుంటున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సోషల్ మీడియాల ద్వారా ప్రచారాన్ని క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్తున్నారు. అన్ని పార్టీల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ రాజకీయ వేడిని పుట్టిస్తున్నారు. ఈ మేరకు డివిజన్లలోని ప్రతి ఓటరు ఫోన్ నంబరును సేకరించేందుకు ప్రత్యేక ఐటీ బృందాలను రంగంలోకి దించారు. ఊర్లలోని వీధివీధికో వాట్సప్ గ్రూపును క్రియేట్ చేసి, అభ్యర్థి ప్రొఫైల్, ఎన్నికల హామీలు, గత సేవా కార్యక్రమాలతో కూడిన సంక్షిప్త సందేశాలను, డిజిటల్ పాంప్లెట్లను ముంచెత్తుతున్నారు. చదవడం రాని ఓటర్ల కోసం అభ్యర్థులు స్వయంగా మాట్లాడిన ఆడియో సందేశాలను నేరుగా వారి సెల్‌ఫోన్లకు పంపుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మరోవైపు, కొత్తగా ఓటు హక్కు పొందిన 'జెన్-జీ' (యువ) ఓటర్లను ఆకర్షించేందుకు సోషల్ మీడియా వేదికలను హోరెత్తిస్తున్నారు. ఫేస్‌బుక్‌లో లైవ్ సెషన్లు నిర్వహిస్తూ డివిజన్ సమస్యలపై చర్చిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆకర్షణీయమైన రీల్స్, షార్ట్ వీడియోలను వదులుతున్నారు. యువతను కనెక్ట్ చేసేందుకు ట్రెండింగ్ పాటలు, ట్రోల్ వీడియోలను సైతం వాడుకుంటూ వాట్సప్ స్టేటస్‌ల ద్వారా వైరల్ చేస్తున్నారు. వాతావరణం అనుకూలించకపోయినా, సమయం సరిపోకపోయినా సోషల్ మీడియా ద్వారా ఓటరు ముంగిటకే వెళ్లేందుకు అభ్యర్థులు పడుతున్న ఈ ఆరాటం మున్సిపల్ పోరును మరింత ఆసక్తికరంగా మార్చింది

# పులివెందులలో 562 మందిపై కేసులు

**మొదటి పేజీ తరువాయి...**

అవినాశ్‌రెడ్డి పట్టుబట్టారు. టీడీపీ అభ్యర్థి ప్రక్రియ పూర్తిచేసి బయటకొచ్చాక పంపిస్తామని పోలీసులు చెప్పినా వినకుండా లోపలికి వెళ్లితీరాల్సిందేనంటూ వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోలీసులపైకి రాళ్లు విసిరారు. కర్రలతో దాడిగి దిగారు. ఆ పార్టీ కార్యకర్తలను నిలువరించేందుకు పోలీసులు గాల్లోకి ఆరు రౌండ్లు కాల్పులు జరిపారు. లాఠీఛార్జ్ చేశారు. అయినా వైఎస్సార్‌సీపీ శ్రేణులు వెనక్కి తగ్గకుండా అరాచకాన్ని కొనసాగించారు. అవినాశ్‌రెడ్డి వారిని వెనకుండి నడిపించారు. నామినేషన్ వేసే కార్యాలయం కొద్ది దూరంలోనే కార్యకర్తలతో బైఠాయించి ఆందోళనకు దిగారు. పోలీసులపైకి మరోసారి రాళ్లు విసిరి, కర్రలతో దాడికి దిగారు. కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ రంగంలోకి దిగి పరిస్థితిని అదుపుచేసేందుకు యత్నించారు. ఎస్పీపైనా వైఎస్సార్‌సీపీ శ్రేణులు రాళ్లతో దాడి చేశారు. దీంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఏంచేయాలో అర్థంకానీ పోలీసులు మరోసారి 10 రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. ఆ వెంటనే భాష్పవాయువు గోళాలు, టియర్‌గ్యాస్ ప్రయోగించారు. దీంతో ఆ పార్టీ కార్యకర్తలు కాస్త వెనక్కి తగ్గారు. ఆ తర్వాతా ఆందోళనను కొనసాగించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు 3 గంటలకి నామినేషన్లు వేసే సమయం ముగిసిపోవడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. ఎంపీ అవినాశ్‌రెడ్డితో పాటు మనోహర్‌రెడ్డి, దుష్యంత్‌రెడ్డి ఈ అరాచకం వెనక ఉన్నారని, ముందస్తు ప్రణాళికతోనే తతంగానికి తెరదీశారని పోలీసులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇవాళ 562 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

# కాంగ్రెస్ సీనియర్ నేత పీఎస్ఎన్ మూర్తి కన్నుమూత

### మూర్తికి ఒడిశా ఎమ్మెల్యే మంగు కిలో నివాళులు



**ముంచంగిపుట్టు, జయ జయహే:**



ఆంధ్ర--ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కోరాపుట్ జిల్లా వనక ఢిల్లీ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పీఎస్ఎన్ మూర్తి (65) అనారోగ్యంతో విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం స్వగ్రామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.మూర్తి మృతివార్త తెలుసుకున్న ఒడిశా ఎమ్మెల్యే మంగు కిలో, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సూపర్ కుమార్ తురక్, ఎంపీ ప్రతినిధి మనోజ్ కుమార్ ఆచార్య, కోరాపుట్ మాజీ ఎమ్మెల్యే రఘురాం పడాల్‌తో పాటు పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తరలివచ్చి పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా ప్రజాసేవలో కొనసాగిన మూర్తి పార్టీలకు అతీతంగా అందరికీ సహాయ సహకారాలు అందించారని, ఆయన మృతి కుటుంబ సభ్యులకు, పార్టీకి, ఆ ప్రాంతానికి తీరని లోటని పలువురు నాయకులు పేర్కొన్నారు.

For a pure tomorrow.. జయహే



## భక్తికి పరిపూర్ణత చక్రస్నానం

(ప్రతాప్)

తొమ్మిది రోజుల వాహనసేవలు, వేదఘోషలు, గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న తిరుమలలో చక్రస్నానం అపురూపమైన ముగింపు ఘట్టం. స్వామి పుష్కరిణిలో సుదర్శన చక్రత్తాళ్వార్లకు నిర్వహించే ఈ పవిత్రస్నానంతో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. సాలకట్ల బ్రహ్మోత్సవాలకు భిన్నంగా నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. అందువల్ల చక్రస్నానమే ఈ ఉత్సవాల సమాప్తిని సూచిస్తుంది.

చక్రస్నానాన్ని 'అవభృథస్నానం' అని కూడా పిలుస్తారు. బ్రహ్మోత్సవాలను మహాయజ్ఞంగా భావించే సంప్రదాయంలో, యజ్ఞసమాప్తి సందర్భంగా నిర్వహించే దీక్షాంతస్నానమే అవభృథం. తొమ్మిది రోజులపాటు నిర్వహించిన ఆరాధనలు సఫలమవ్వాలని, తెలిసీతెలియక జరిగిన చిన్నపాటి లోపాలు పరిహారమవ్వాలని ప్రార్థిస్తూ ఈ క్రతువును నిర్వహిస్తారు. భక్తులకు సుఖశాంతులు, సమస్త లోకాలకు శ్రేయస్సు కలగాలన్న విశాల సంకల్పం ఇందులో ఇమిడి ఉంది.

శ్రీమహావిష్ణువు దివ్యాయుధమైన సుదర్శన చక్రానికి వైష్ణవ సంప్రదాయంలో విశిష్ట స్థానం ఉంది. భగవంతుని రక్షణశక్తికి ప్రతిరూపంగా భావిస్తూ 'చక్రత్తాళ్వార్'గా ఆరాధిస్తారు. అందుకే చక్రస్నానం ఒక ఆయుధానికి చేసే సాధారణ అభిషేకం కాదు; దైవశక్తికి సమర్పించే విశేష ఆరాధన. అధర్మాన్ని తొలగించి ధర్మాన్ని పరిరక్షించే భగవత్సంకల్పాన్ని సుదర్శన చక్రం భక్తులకు గుర్తుచేస్తుంది.

ఈ వేడుకకు ముందు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారిని, సుదర్శన చక్రత్తాళ్వార్లను స్వామి పుష్కరిణి సమీపంలోని శ్రీవరాహస్వామి ఆలయ ముఖమండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ వైఖానస ఆగమ సంప్రదాయానుసారం స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో అభిషేకాలు జరుగుతాయి. వేదపండితుల సూక్తపఠనం నడుమ సాగే ఈ ఆరాధన భక్తులను పరవశింపజేస్తుంది. అనంతరం అర్చకులు సుదర్శన చక్రత్తాళ్వార్లను పుష్కరిణి జలాల్లో ముంచి చక్రస్నానం నిర్వహిస్తారు.

ఆ దివ్యఘట్టాన్ని దర్శిస్తూ భక్తులు గోవింద నామస్మరణతో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. చక్రత్తాళ్వార్ల సాన్నిధ్యంలో చేసే తీర్థస్నానం పాపవిముక్తిని, దైవానుగ్రహాన్ని ప్రసాదిస్తుందని వారి విశ్వాసం. ఉత్సవాలను నిర్వహించినవారు, సహకరించినవారు, సేవలందించినవారు, దర్శించినవారు అందరూ ఉత్సవయజ్ఞ ఫలాన్ని పొందాలన్న భావన ఈ క్రతువు ప్రత్యేకత. వ్యక్తిగత శ్రేయస్సుతోపాటు సామూహిక మంగళాన్ని కోరుకోవడం దీని విశిష్ట సందేశం.

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఒకే పుష్కరిణిలో స్నానమాచరించడం సమష్టి భక్తికి సుందరమైన ప్రతీక. భాషలు, జీవనపరిస్థితులు వేరైనా అందరి పెదవులపై వినిపించేది ఒకే గోవిందనామం. అందరి హృదయాల్లో ఉండేది స్వామి కృపను పొందాలన్న ఆకాంక్షే. ఈ ఆధ్యాత్మిక అనుబంధం మనుషుల మధ్య సాన్నిహిత్యాన్ని పెంచుతుంది. భగవంతుని సన్నిధిలో వినయం, సమభావం ఎంత అవసరమో తెలియజేస్తుంది.

ఈ ఆచారంలోని అంతరార్థాన్ని జీవితానికి అన్వయించుకుంటే చక్రస్నానం మరింత అర్థవంతమవుతుంది. జలస్నానంతోపాటు అంతరంగశుద్ధిని కోరుకోవాలి. కోపం, ద్వేషం, అసూయలను తగ్గించుకుని కరుణ, సహనం, సేవాభావాలను పెంచుకోవాలి. ప్రార్థనలో కోరుకునే లోకక్షేమానికి మన ప్రవర్తనతోనూ తోడ్పడాలి. పవిత్రతను పుష్కరిణి జలాల్లో దర్శించిన మనం, దానిని మన ఆలోచనల్లోనూ నిలుపుకోవాలి.

ఉత్సవ వైభవాన్ని చూసి ఆనందించడం ఒక అనుభూతి; దాని సందేశాన్ని ఆచరించడం జీవితానికి దిశ. తోటి భక్తులకు సహకరించడం, సేవకుల శ్రమను గౌరవించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కూడా భక్తి వ్యక్తీకరణలే. దైవానుగ్రహం కోరే మనసు ఇతరుల మేలును కోరగలిగినప్పుడు ఆరాధనకు సార్థకత చేకూరుతుంది. చక్రస్నానంతో ఉత్సవం ముగిసినా, ఆ వేడుక రగిలించిన సత్సంకల్పం మనలో కొనసాగాలి. భగవంతునికి సమర్పించిన భక్తి, సమాజానికి అందించే మంచితనంగా వికసించాలి. అదే ఈ పవిత్ర క్రతువు నుంచి మనం స్వీకరించగల జీవన సందేశం.

# వేడుకల్లో భద్రతే ప్రథమం!

(ప్రతాప్)

**అమ్మవారి దర్శనానికి వెళ్లినవారు విగతజీవులుగా ఇంటికి చేరడం, దాండియా సంబరాల్లో పాల్గొన్న విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం ఎంతటి విషాదం! ఆనందాన్ని పంచాల్సిన ఉత్సవాలు కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చాయి. అక్టోబరు 17న పశ్చిమ బెంగాల్, హైదరాబాద్‌లో జరిగిన రెండు ఘటనలు సామూహిక వేడుకల్లో భద్రతకు ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేశాయి. భక్తి, ఉత్సాహం ఎంత ఉన్నా ప్రాణరక్షణకు ప్రత్యామ్నాయం కావు.**





ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బాగాన్ దుర్గాపూజ మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో కనీసం 19 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు. వర్షం ప్రారంభమైన సమయంలో జనసమూహంలో కదలికలు పెరిగి, కొందరు కిందపడటంతో పరిస్థితి ప్రమాదకరంగా మారినట్లు పోలీసులు తెలిపారు. జననియంత్రణ, భద్రతా ఏర్పాట్లలో లోపాలున్నాయా అనే అంశాలపై దర్యాప్తు జరుగుతోంది. దైవదర్శనానికి వచ్చిన కుటుంబాలు అనూహ్యంగా ఆత్మీయులను కోల్పోవడం హృదయవిదారకం.

హైదరాబాద్ శివారులోని నాదర్‌గుల్ ఎంవీఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో దాండియా వేడుక జరుగుతుండగా విద్యుద్దీపాలు అమర్చిన లోహపు చట్రం కూలింది. పద్దెనిమిదేళ్ల విద్యార్థిని ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. ఆ సమయంలో ప్రాంగణంలో ఆరువందల మందికిపైగా విద్యార్థులున్నట్లు పోలీసులు తెలిపారు. గాలికి చట్రం కూలినట్లు ప్రాథమిక సమాచారం ఉన్నప్పటికీ, నిర్మాణ దృఢత్వం, అమరిక, నిర్వహణ బాధ్యతలను సమగ్రంగా పరిశీలించాలి.

రెండు ఘటనల్లోనూ నిర్లక్ష్యానికి సంబంధించిన బాధ్యతలను దర్యాప్తు నిర్ధారించాలి. అయితే ఇవి లేవనెత్తుతున్న భద్రతా ప్రశ్నలను అప్పటివరకు పక్కనపెట్టలేం. ఎంతమంది వస్తారనే అంచనా, ప్రాంగణ సామర్థ్యం, ప్రవేశనిష్క్రమణ మార్గాలు, వాతావరణ మార్పులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ప్రతి కార్యక్రమ ప్రణాళికలో ఉండాలి. అలంకరణకు పెట్టే శ్రద్ధను జనరక్షణకు కూడా కేటాయించాలి.

భారీ జనసందోహం చేరే ప్రదేశాల్లో ప్రవేశానికి పరిమితి విధించాలి. లోపలున్నవారు బయటకు వచ్చిన తరువాతే మరికొందరిని అనుమతించాలి. ప్రవేశం, నిష్క్రమణకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేయాలి. అత్యవసర దారుల్లో దుకాణాలు, వాహనాలు, అలంకరణ సామగ్రి ఉండకూడదు. జనసాంద్రత పెరుగుతున్న ప్రాంతాలను నిరంతరం పరిశీలించి, ఒత్తిడి ప్రమాదకరంగా మారకముందే జనప్రవాహాన్ని మళ్లించాలి. స్పష్టమైన ప్రకటనలతో ప్రజలకు దిశానిర్దేశం చేయాలి.

తాత్కాలిక వేదికలు, దీపాల చట్రాలు, భారీ తెరలను అర్హులైన సాంకేతిక నిపుణులతో తనిఖీ చేయించాలి. గాలి ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం, బిగింపులు, ఆధారాల స్థిరత్వాన్ని నిర్ధారించాలి. విద్యుత్ తీగలు, ఎర్తింగ్, వర్షంలో విద్యుత్ సరఫరా నిలిపివేసే ఏర్పాట్లను పరీక్షించాలి. ప్రతికూల వాతావరణంలో కార్యక్రమాన్ని నిలిపివేయడానికి ముందుగానే స్పష్టమైన కార్యాచరణ ఉండాలి.

ప్రతి వేడుకకు ఒక భద్రతా సమన్వయకర్తను నియమించి, నిర్వాహకులు, సాంకేతిక సిబ్బంది, భద్రతా బృందాల బాధ్యతలను రాతపూర్వకంగా నిర్ణయించాలి. పోలీసు, అగ్నిమాపక, వైద్యసేవలతో ముందస్తు సమన్వయం అవసరం. అంబులెన్స్‌కు మార్గం, ప్రథమ చికిత్స కేంద్రం, అత్యవసర సమాచార వ్యవస్థ సిద్ధంగా ఉండాలి. శిక్షణ పొందిన వాలంటీర్లతో కార్యక్రమానికి ముందే సాధన నిర్వహించాలి.

హాజరయ్యేవారికీ భద్రతా సమాచారం అందించాలి. ప్రవేశద్వారం వద్ద అత్యవసర మార్గాల పటం, సహాయ కేంద్రాల వివరాలు కనిపించాలి. వర్షం లేదా గాలి పెరిగితే ఎక్కడికి వెళ్లాలో ముందుగానే తెలియజేయాలి. పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సహాయం ఉండాలి. ప్రమాదం కనిపించినప్పుడు ఎవరికి తెలియజేయాలో ప్రతి వాలంటీర్‌కు అవగాహన కల్పించాలి. భద్రతా తనిఖీలను కాగితాలకే పరిమితం చేయకుండా, కార్యక్రమం ప్రారంభానికి ముందు ప్రత్యక్షంగా పరిశీలించి లోపాలను సరిచేయాలి.

పరిహారం బాధిత కుటుంబాలకు అండగా నిలవొచ్చు; కోల్పోయిన ప్రాణాన్ని తిరిగివ్వలేదు. దర్యాప్తు నిర్ధారించిన లోపాలపై బాధ్యత నిర్ణయించడంతోపాటు, ఇతర వేదికల్లోనూ తక్షణ తనిఖీలు జరగాలి. ప్రతి నిర్వాహకుడు తన కార్యక్రమాన్ని భద్రతా దృష్టితో మళ్లీ సమీక్షించాలి. వేడుక విజయానికి కొలమానం జనసంఖ్య, విద్యుద్దీపాల మెరుపులు కావు. వచ్చిన ప్రతి వ్యక్తీ క్షేమంగా ఇంటికి చేరడమే అసలైన విజయం!



## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**అడిషనల్ ఎస్పీ శృతి, డీఎస్పీ రాజసింహారెడ్డి**

**ముంచంగిపుట్టులో పోలింగ్ కేంద్రాల పరిశీలన**

**ముంచంగిపుట్టు, జయ జయహే**

రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ముంచంగిపుట్టు మండలంలో పోలీసు అధికారులు భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా అడిషనల్ ఎస్పీ వై. శృతి, డీఎస్పీ వి. రాజసింహారెడ్డి ముంచంగిపుట్టులోని బాలుర పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.అనంతరం స్థానిక ఎంపీడీవో కే. ధర్మారావు , ఇతర అధికారులతో కలిసి ఎన్నికల నిర్వహణ, భద్రతా చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని అధికారులు కోరారు.

## శరన్నవరాత్రుల ప్రత్యేక శీర్షిక 9 వరోజు

# మహిషాసుర మర్దిని అలంకరణ

### మహార్నవమి శుభాకాంక్షలుతో..

ఇంద్రకీలాద్రిలో శ్రీ కనకదుర్గ అమ్మవారు విశేషమైన మహిషాసుర మర్దిని అలంకరణలో మనకు దర్శనమిస్తున్నారు. మహిషాసురుడు అనే రాక్షసుడుని తన యొక్క శక్తితో, వివిధ రూపాలతో తొమ్మిది రోజులు పోరాటం చేసి ఈ మహర్నవమి రోజున రోజున అంతం చేసి విజయదశమి రోజున చక్కటి ప్రసన్న రూపంతో అమ్మవారు అందరికీ సాక్షాత్కరిస్తారు.

శరన్నవరాత్రులలో తొమ్మిదవ రోజును మహర్నవమి అంటారు.

**ప్రాముఖ్యత:**

ఈ రోజును మూడు పేర్లతో పిలుస్తారు – దుర్గా నవమి, ఆయుధ పూజ, సరస్వతీ పూజ. శక్తి, శ్రమ, జ్ఞానం ఈ మూడింటిని పూజించే రోజు.

**ఆయుధ పూజ:**

మనం చేసే వృత్తియే మన ఆయుధం. రైతు నాగలిని, విద్యార్థి పుస్తకాన్ని, గృహిణి వంట పాత్రలను ఈ రోజు శుభ్రం చేసి పూజిస్తారు. పనిని దైవంగా భావించడమే దీని సందేశం.

**కుంకుమ పూజ:**

మహిళలు పసుపు, కుంకుమ, పూలు, అరటిపండ్లు, అక్షింతలతో అమ్మవారికి కుంకుమార్చన చేస్తారు. ఇది సౌభాగ్యం, ఐశ్వర్యం, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. ఈ రోజు చేసే పూజకు నూరు రెట్లు ఫలితం ఉంటుంది.

**సరస్వతీ పూజ:**

కొన్ని ప్రాంతాలలో ఈ రోజు పుస్తకాలను, పెన్నులను పూజించి, చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తారు. జ్ఞానానికి ప్రతీక.

**ముగింపు:**

మహర్నవమి మనలోని చెడు గుణాలనే రాక్షసుడిని జయించమని బోధిస్తుంది. ఈ రోజు సాధన చేస్తే, మరుసటి రోజు విజయదశమి నాడు విజయం తప్పక లభిస్తుంది.

**రచన**

**ఏ.బాల సౌజన్యకుమారి,**

**తెలుగు ఆచార్యులు,**

**నంది అవార్డు గ్రహీత,**

**ఆధ్యాత్మికవేత్త, ప్రవచన కర్త.**









## ర్యాలీలకు దూరం.. చట్టానికి గౌరవం!

**రాజమహేంద్రవరం జయ జయహే :అక్టోబర్ 18**

:ధవళేశ్వరంరాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ధవళేశ్వరం పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సౌత్‌జోన్ డీఎస్పీ శివప్రియ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.రాజకీయ పార్టీల ర్యాలీలు, ఊరేగింపులు, ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనవద్దని డీఎస్పీ శివప్రియహెచ్చరించారు. రాజకీయ విభేదాలు, వ్యక్తిగత కక్షలు, వర్గపోరాటాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఘర్షణలకు దిగడం, ఇతరులను రెచ్చగొట్టడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడటం వంటి వాటికి దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన నేరాల్లో చిక్కుకుంటే చట్టపరమైన పరిణామాలను ఎదు-ర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఎన్నికల సమయంలో ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రశాంతవాతావరణాన్ని కాపాడటం పోలీసుల బాధ్యతని ఈసందర్భంగా స్పష్టం చేశారు. ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగించే ప్రయత్నాలను సహించబోమని, చట్టాన్ని అతిక్రమించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకుని, నేరాలకు దూరంగా ఉంటూ సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా మెలగాలని సూచించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించాలని పోలీసు అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో సిఐ గణేష్, ఎస్సై హరిబాబు, ఎస్సై విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముంచంగిపుట్టులో స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయం ఆసక్తికరం!

### రెండు దశాబ్దాల తర్వాత పురుషులకు అవకాశం!

### ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు ఎస్టీ జనరల్‌కు కేటాయింపు

### స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఆశావహుల్లో చిగురించిన ఆశలు

### టికెట్ల కోసం నాయకుల ప్రయత్నాలు ముమ్మరం



**ముంచంగిపుట్టు, జయ జయహే:**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముంచంగిపుట్టు మండలంలో రాజకీయ సందడి మొదలైంది. గత రెండు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ల కారణంగా మహిళలకే పరిమితమైన మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జడ్పీటీసీ) పదవులు ఈసారి ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో ఆశావహుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ముఖ్యంగా ఎంపీపీ పీఠంపై పురుషులు కూర్చునేందుకు అవకాశం ఏర్పడటంతో వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. పార్టీ అధిష్టానం నుంచి టికెట్ దక్కించుకుని ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో పావులు కదుపుతున్నారు.

**మహిళలకే పరిమితమైన ఎంపీపీ పీఠం**

ముంచంగిపుట్టు మండలంలో గతంలో జరిగిన ఎంపీపీ ఎన్నికలను పరిశీలిస్తే మహిళలే మండల పరిషత్ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. 2001లో కాసులమ్మ( కాంగ్రెస్) ఎంపీపీగా ఎన్నికయ్యారు. అనంతరం 2006లోనూ మరోసారి ఆమెనే పదవి వరించింది. దీంతో ఆమె సుమారు పదేళ్లపాటు మండల పరిషత్ అధ్యక్షురాలిగా కొనసాగారు. 2014లో వెచ్చంగి పద్మ (వైసిపి ) ఎంపీపీగా బాధ్యతలు చేపట్టగా, 2021లో అరిసెల సీతమ్మ( వైసిపి) ఈ పదవిని చేపట్టారు. ఇలా వరుసగా మహిళలే ఎంపీపీ పీఠాన్ని అధిరోహించారు.

ఈసారి ఎన్నికల రిజర్వేషన్లలో ఎంపీపీ స్థానం ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో పురుష అభ్యర్థులకు సైతం పోటీ చేసే అవకాశం ఏర్పడింది. దీంతో వివిధ పార్టీలకు చెందిన ఆశావహులు టికెట్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. తమకు అవకాశం కల్పిస్తే ప్రజల మద్దతుతో గెలిచి చూపిస్తామని పార్టీ పెద్దలకు భరోసా ఇస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**జడ్పీటీసీ స్థానంపైనా ఆశలు**

మరోవైపు ముంచంగిపుట్టు జడ్పీటీసీ స్థానం సైతం ఈసారి ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. గత రెండు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ల కారణంగా ఈ స్థానం నుంచి మహిళలే ప్రాతినిధ్యం వహించారు.

2001లో రొబ్బా ఈశ్వరమ్మ( బీఎస్పీ) తరఫున జడ్పీటీసీగా ఎన్నికయ్యారు. 2006లో వెచ్చంగి పద్మ( కాంగ్రెస్) , 2014లో కాసులమ్మ (వైసిపి), 2021లో జల్లిపల్లి సుభద్ర( వైసిపి) ఈ స్థానం నుంచి ఎన్నికై ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం జల్లిపల్లి సుభద్ర ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. అలాగే వెచ్చంగి పద్మ 2026లో జడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

ఈసారి జడ్పీటీసీ స్థానం ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో ఈ పదవిపై పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులు తమ రాజకీయ ప్రయత్నాలను వేగవంతం చేస్తున్నారు. వివిధ పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న నాయకులు తమకు అనుకూలమైన పరిస్థితులను సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు.

**ఎన్నికల వేళ ఆసక్తికరంగా రాజకీయ సమీకరణాలు**

ముంచంగిపుట్టు మండలంలో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో ఈసారి ఎన్నికల బరిలో ఎవరెవరు నిలుస్తారనే అంశంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు మహిళల ప్రాతినిధ్యంతో కొనసాగిన ఈ పదవులకు ఈసారి పురుష అభ్యర్థులు పోటీ చేసే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో చర్చ ఊపందుకుంది.

రిజర్వేషన్ల మార్పుతో ఆశావహులకు అవకాశం ఏర్పడినా, తుది అభ్యర్థుల ఎంపిక మాత్రం ఆయా పార్టీల నిర్ణయాలు, స్థానిక రాజకీయ సమీకరణాలపై ఆధారపడి ఉండనుంది. దీంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముంచంగిపుట్టు మండలంలో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు ఎవరిని వరిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.



## స్థానిక ఎన్నికల్లో విజయకేతనం ఎగరవేయాలి

### వైసిపి మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు

**దేవరాపల్లి, అక్టోబర్ 18, జయ జయహే :**

మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసేలా ప్రతీ ఒక్కరూ కష్టపడి పని చేయాలని వైఎస్సార్సీపీ దేవరాపల్లి మండల అధ్యక్షుడు, ఎంపీపీ అభ్యర్థి బూరె బాబురావు సూచించారు. మండలంలోని కాశీపురం, దేవరాపల్లి, తామరబ్బ గ్రామాలలో మాజీ జెడ్పీటీసీ కర్రి సత్యంతో కలిసి శనివారం ఆయన పర్యటించి స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చలు జరిపారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సిఎం బూడి క్యాలనాయుడు నేతృత్వంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అవినీతి, అక్రమాలతో పాటు మోసాలను సైతం ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పని చేసి వైఎస్సార్సీపీ, మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు బలపరిచిన జెడ్పీటీసీతో పాటు ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండారు దేముడునాయుడు, దాసరి గోపి, మాజీ సర్పంచ్ కురి రాజాబాబు, గుమ్మడపు మహేష్, డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు, పార్టీ సీనియర్ నాయుకులు వరదపురెడ్డి లలితనాయుడు, కెవి. రమణ, వేచలపు అప్పలనాయుడు తదితర నాయుకులు పాల్గొన్నారు.

## కాసరంలో విద్యుత్ మోటార్ల చోరీ

**తొట్టంబేడు, అక్టోబర్ 18, జయ జయహే**



తొట్టంబేడు మండలం కాసరం గ్రామ పరిధిలోని తెలుగు గంగ కాలువ సమీపంలో విద్యుత్ మోటార్ల చోరీ ఘటనలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి 11 మోటార్లు, శనివారం రాత్రి మరో మూడు మోటార్లను అపహరించినట్లు రైతులు తెలిపారు. వ్యవసాయం కోసం అప్పులు చేసి, కష్టపడి పొలాల్లో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను దుండగులు ఎత్తుకెళ్లడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు నీరు అందించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు.సంబంధిత అధికారులు స్పందించి మోటార్ల చోరీకి పాల్పడిన దుండగులను గుర్తించి, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పొలాల వద్ద నిఘా పెంచాలని విజ్ఞప్తి చేశారు.



## స్థానిక సమరానికి సంసిద్ధంగా ఉండాలి

### ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

**దేవరాపల్లి, అక్టోబర్ 18, జయ జయహే**

: స్థానిక సమరానికి కూటమి శ్రేణులు సంసిద్ధంగా ఉండాలని, గ్రామాలలో కూటమి బలపరిచిన ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి గ్రామాభివృద్ధికి మరింత తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. మండల కేంద్రం దేవరాపల్లిలోని అల్లిపురం వద్ద మండల కూటమి కార్యకర్తల సమావేశం జరిగింది. స్థానిక నాయకులు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే బండారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో కూటమి శ్రేణులు సమిష్టిగా పనిచేసి పదవులు వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల తీర్పే భవిష్యత్తులో పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే హక్కు కూటమి ప్రభుత్వందేనన్నారు. తప్పుడు నిర్ణయాలతో పార్టీని మోసం చేయొద్దని అన్నారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన నాయకులతో ఎంపిటిసి, జడ్పిటిసి అభ్యర్థుల ఎంపిక విషయమే వేరువేరుగా చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు దాసరి శ్రీనివాస్, పోతల పాత్రు నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, దొగ్గ దేవుడు నాయుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరఖాన సూర్యనారాయణ, కొమర బాబురావు, చామంతుల వెంకన్న దొర, రెడ్డి పైడం నాయుడు, కడిమి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దేవరాపల్లి ఎంపీపీ బరిలో బూరె బాబురావు

**దేవరాపల్లి, అక్టోబర్ 18, జయ జయహే :**



దేవరాపల్లి మండల వైఎస్ఆర్ సీపీ ఎంపీపీ అభ్యర్థిగా బోయిల కింతాడ మాజీ సర్పంచ్, మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు పేరును అధిష్టానం ఖరారు చేసింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి , మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు , దేవరాపల్లి మండల వైఎస్ఆర్ సీపీ కుటుంబ సభ్యుల ఆశీస్సులతో నాకు ఎంపీపీ అభ్యర్థిగా అవకాశం కల్పించారని బాబురావు తెలిపారు. వైసీపీ శ్రేణులు నా శ్రేయోభిలాషులుగా ఉండటం గర్వంగా ఉంది. మీ సహాయ సహకారాలు, చల్లని దీవెనలు అందించి ఆశీర్వదించాలని వినయపూర్వకంగా కోరుతున్నాను ఆయన తెలిపారు.



## పైడితల్లికి రజత కిరీట కానుక

**రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 18**

తుమ్మలోవ శ్రీ పైడితల్లి అమ్మవారి సన్నిధిలో వెండి కిరీటం సమర్పణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హితకారిణి సమాజం చైర్మన్ డాక్టర్ యాళ్ల ప్రదీప్ కుటుంబ సభ్యులు భక్తితో తయారు చేయించిన వెండి కిరీటాన్ని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఆయన సతీమణి, మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.



## గురిబిల్లి సత్యనారాయణ రెడ్డికి జక్కంపూడి రాజా నివాళి

**రాజమహేంద్రవరం: జయ జయహే అక్టోబర్ 18**

గురిబిల్లి సత్యనారాయణ రెడ్డి మృతి పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ సమీపంలోని సత్యనారాయణ రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు గుందేశి శ్రీనివాస్ రెడ్డి మావయ్య అయిన సత్యనారాయణ రెడ్డి మృతి విషయం తెలుసుకున్న జక్కంపూడి రాజా, శ్రీనివాస్ రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్‌తో పిజిఆర్ఎస్ రద్దు

**రాజమండ్రి: జయ జయహే : అక్టోబర్ 18**



స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. అక్టోబర్ 14 నుంచి డిసెంబర్ 2 వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ ముగిసే వరకు పీజీఆర్ఎస్ నిర్వహించబోమని స్పష్టం చేశారు. తదుపరి ప్రకటన వెలువడే వరకు ఈ కార్యక్రమం నిలిపివేయనున్నట్లు పేర్కొంటూ, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## 45 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు ప్రతిరోజూ బిక్ష.

**కొయ్యురు జయ జయహే**




కొయ్యురు మండలం లోని సింగవరం సాయిబాబా గుడి దగ్గర ఈనెల 22 నుండి 45 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు ప్రతిరోజూ బిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియరు. శబరిమల యాత్రకు, దీక్షలో ఉన్న స్వాములకు ఇబ్బంది లేకుండా ప్రతిరోజూ అన్నదానం చేస్తున్నామని, భక్తులందరూ ఈ పుణ్యకార్యంలో పాల్గొనాలని అంజి, రాజేష్, కిరణ్, చంటి,స్వాములు కోరారు.

# మన ఆరోగ్యం కోసం మనం ప్రకృతి పంటలనే భుజించాలి

## ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులు పెరగాలి

## విజయదశమి సందర్భంగా జమ్మి చెట్టులు నాటి పెంచాలి : చిరంజీవి చౌదరి






**విశాఖపట్నం (జయ జయహే)**

మన ఆరోగ్యం కోసం మనం ప్రకృతి పంటలనే భుజించాలి అని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి కోరారు. ఆదివారం ఉదయం మద్దిలపాలెం లోని ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ గ్రౌండ్స్ దగ్గర ఉన్న ఆ హబ్ లో ప్రకృతి పంటల సంత మొదటి వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విజయదశమిని పురస్కరించుకొని ముందుగా గ్రీన్ క్లైమేట్ టీం తీసుకోవచ్చన జమ్మి మొక్కను నాటిన అనంతరం ఆయన రైతులు నిర్వహిస్తున్న సంతను సందర్శించారు. ఆ తర్వాత జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులు పెరగాలని అందుకు ప్రస్తుతం ప్రకృతి ఆధారంగా పంటలు పండిస్తున్న రైతులు అందరూ తీవ్రంగా కృషి చేయాలని కోరారు. ఇళ్ల వద్ద వ్యవసాయం చేసుకునే మహిళా రైతుల సంఖ్య కూడా పెరగాలని ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికి ప్రకృతి ఆధారంగా పండించిన పంటలు మాత్రమే ఆరోగ్యకరమైనవి అనే విషయాన్ని తెలియ చెప్పాలని కోరారు. విజయదశమి సందర్భంగా జమ్మి చెట్టులు నాటి పెంచాలి అని పిలుపునిచ్చారు. దేవతా వృక్షాలు నాటి పెంచడం ప్రతి ఒక్కరి తక్షణ కర్తవ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన గోవర్ధనపురం గోసాల వారు "నేటివ్ స్ప్రౌట్" నేతృత్వంలో దొడ్డా మహేష్ రైతుల లబ్ధి కోసం, వినియోగదారుల ఆరోగ్యం కోసం రూపొందించిన పాటను ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ యువ రైతు దేవరపల్లి కి చెందిన ఎస్ జగదీష్ కు సాలువా కప్పి సన్మానం చేశారు, జ్ఞాపికను అందజేశారు. అలాగే ప్రకృతి పంట సంతకు పంటలను తీసుకువస్తున్న వారికి సాలువా కప్పి సన్మానం చేశారు, సహకరిస్తున్న వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జలగం కుమార్ స్వామి, గో ఆధారిత ప్రకృతి రైతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి ఎల్ ఎన్ రాజు, ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం జిల్లా అధికారి జనార్ధన్, ఆ అబ్ సీఈవో శ్రీనివాస రాజు గో ఆధారిత ప్రకృతి రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ , సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు, మ్యాంగో మ్యాన్ అప్పాజీ, వనమాలి సిటిజి అడ్మిన్ మళ్ళ సరిత, మిద్దె తోట రైతు శుభారమ, తులసి నేచురల్స్ సత్యనారాయణ, పక్షి ప్రేమికుడు గణేష్, వర్షపునీరు ఆధాచేసే ప్రకృతి రైతు ప్రసాద రాజు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి రత్నం, సమన్వయకర్త పివిఎస్ భాస్కర్, సీనియర్ జర్నలిస్టు యుగంధర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

# మేయర్ పదవికి 29మంది పోటీ

## ఆ 29 మంది అభ్యర్థులు 39 నామినేషన్లు దాఖలు

## మేయర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.దయానిధి

**విశాఖపట్నం అక్టోబర్ 18, జయ జయహే**



మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ రెండవ సాధారణ ఎన్నికల పోటీకి సంబంధించి మేయర్ పదవికి 29 అభ్యర్థులు 39 నామినేషన్ దాఖలు చేశారని మేయర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.దయానిధి ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

**పార్టీ వారిగా దాఖలైన నామినేషన్లు వివరాలు**

బీఎస్పీ పార్టీ నుండి కరణం కీర్తన గ్రేస్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుండి వెంకటలక్ష్మి జెర్రిపోతుల, ఉష్నారా పర్వీన్, దేవర నాగ సునంద దేవి (2), ప్రియాంక దండి (2), షేక్ దౌలతునిషా (2), భోర సంతోషి (1), మొత్తం 9 సెట్లు, తెలుగుదేశం పార్టీ నుండి శ్రావణి ముక్క (3), సేనాపతి వసంత ఒక నామినేషన్, మొత్తం 4 సెట్లు, వైయస్సార్సీపి నుంచి వరుదు కళ్యాణి (3), పేడాడ రమణకుమారి (1), వెంకట విజయ కుమారి తిప్పల(1), మొత్తం 5 సెట్లు, ఇతర పార్టీలు నమ్మి భవాని (2), కొప్పుల సత్యవాణి, వట్టికొల్ల సరోజ దేవి, చింతాడ పద్మిని, దాసరి లక్ష్మీసంధ్య, శైలజ తలుపుల, మొత్తం 7 సెట్లు, స్వతంత్రులు వియ్యపు ఉమా, పకృతి సి వి వి ఏ ఆర్ కె దేవిక, వాండ్రాసి శాంతి కుమారి (2), వాడమొదుల పద్మ, కనికిల్లి లక్ష్మి, గొంప వెంకట పద్మావతి, పదిరెడ్ల వరలక్ష్మి, పులిచెర్ల రాజేశ్వరి, పెద్దాడ కీర్తి, ఫ్యాన్సీనమ్మ అత్తిలి, లిఖిత లండ (2), మొత్తంగా 13 సెట్లు కాగా 16 నుంచి 18 వ తేదీ వరకు మేయర్ పదవికి 29 మంది అభ్యర్దులు 39 నామినేషన్లను దాఖలు చేశారని మేయర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.దయానిధి తెలిపారు. 17వ తేదీన ఏడు నామినేషన్లు, 18వ తేదీన 32 నామినేషన్లు మొత్తంగా 39 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఆయన తెలిపారు.




# ఎన్నికల ఏర్పాట్లను పరిశీలకులకు వివరించిన జీవీఎంసీ కమిషనర్

## నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎన్నికల, వ్యయ పరిశీలకులు

**విశాఖపట్నం, అక్టోబర్ 18, జయ జయహే**

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ రెండో సాధారణ ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, ఎన్నికల ప్రక్రియ అమలు తీరును జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదివారం జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకులకు వివరించారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎ. భార్గవ తేజ, వ్యయ పరిశీలకులు పి. వెంకట సందీప్ రెడ్డి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకోగా, కమిషనర్ తన ఛాంబర్లో వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ముందస్తు ఏర్పాట్లు, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, సంబంధిత అధికారుల బాధ్యతలు, ఎన్నికల నియమావళి అమలు తదితర అంశాలను వివరించారు. ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలను కమిషనర్ పరిశీలకులకు తెలియజేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. అనంతరం జిల్లా ఎన్నికల పరిశీలకులు, వ్యయ పరిశీలకులు మేయర్ రిటర్నింగ్ అధికారి గదిని సందర్శించారు. అక్కడ జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లు, ప్రక్రియ నిర్వహణ తీరును గమనించారు. ఎన్నికల నిబంధనలను అనుసరిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏమైనా సమస్యలున్నా, ఫిర్యాదులున్నా తనకు నేరుగా తెలియజేయవచ్చని జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎ. భార్గవ తేజ తెలిపారు. ఫోన్ నెం.70955 99001 ద్వారా తనను సంప్రదించవచ్చని సూచించారు. జీవీఎంసీ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అలాగే వ్యయ పరిశీలకులు పి. వెంకట సందీప్ రెడ్డి కూడా తన నెంబర్ను వెల్లడిస్తూ ఏమైనా ఫిర్యాదులుంటే తనకు నేరుగా ఫోన్ నెం.9440810041 ద్వారా తెలియజేవచ్చని సూచించారు. జీవీఎంసీ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్లు రమణమూర్తి, వర్మ, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ రమణ, సెక్రటరీ వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా హెల్పింగ్ స్వచ్ఛంద సేవా సంస్థ

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 18, జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలోని సన్నగరి వీధిలో హెల్పింగ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 178వ నెల సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులను సంస్థ అధినేత మునీర్ బాషా, సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మునీర్ బాషా మాట్లాడుతూ, భగవంతుడు ప్రసాదించిన సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు సహాయం చేయడానికి వినియోగించడమే నిజమైన ధర్మమన్నారు. తన చిల్డ్రన్స్ ఫ్యాన్సీ దుకాణం ద్వారా వచ్చే ఆదాయంతో గత 178 నెలలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో సేవలను మరింత విస్తరించడంతో పాటు, దివ్యాంగులు స్వయంగా ఉపాధి పొందేలా ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రాజేశ్వరరావు, గరికపాటి రమేష్, కొల్లూరు హరినాథ్, బాబా ఫరీద్, సుధా ల్యాబ్ హబీబ్, సంస్థ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.






# రాష్ట్రస్థాయి మత్స్యకార సదస్సును విజయవంతం చేయాలి

## నూతన అధ్యక్షుడు గంగపుత్ర గాంధీకి ఘన సన్మానం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 18, జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలో ఈ నెల 28, 29 తేదీల్లో గంగా సదన్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మత్స్యకార సంక్షేమ సమితి సదస్సును విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణ మత్స్యకార సంక్షేమ సమితి నూతన అధ్యక్షుడు గంగపుత్ర గాంధీ ఆధ్వర్యంలో శ్రీ కావమ్మ గుడి శ్రీరామ మందిరం వద్ద సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సుకు మత్స్యకారులు, బెస్త సామాజిక వర్గీయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోటకొండ గోపాలరాజు, శ్రీకాళహస్తి అధ్యక్షుడు మన్నేపల్లి శ్రీనివాసులు నూతన అధ్యక్షుడు గంగపుత్ర గాంధీని శాలువాతో సత్కరించి అభినందించారు. బీసీ కులాలన్నీ ఐక్యంగా ముందుకు సాగుతూ సామాజిక ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గరిగపాటి రమేష్ బాబు, మొగరాల గణేష్, నెల్లూరు కన్నయ్య, బెట్టిం వెంకటేశ్వర్లు, మాదాసు నాగార్జున, కాట్రపల్లి బాలకృష్ణ, మోహన కృష్ణ, తుల్లిపూడి ధనంజేయులు, మిఠాయి మురళి, సుధాకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



# బ్రహ్మకుమారి సమాజంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

## ఆధ్యాత్మిక కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: అంజూరు తారక శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి, అక్టోబర్18, జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలోని ఈశ్వరీయ బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవనంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఆధ్యాత్మిక దర్శన భాగ్యం కల్పించడం అభినందనీయమన్నారు. బ్రహ్మకుమారి సమాజం ద్వారా ఉచితంగా ధ్యానం, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, ఆరోగ్యాన్ని పొందాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రమణి సిస్టర్, పట్టణ ప్రముఖులు వల్లం గోపి, ప్రసాద్, షాజహాన్, బ్రహ్మకుమారి సమాజ సభ్యులు పాల్గొన్నారు.

# నమ్మించి ఘాతుకం!

**(హెచ్. ప్రతాప్)**

**పదమూడేళ్ల వివాహబంధం.. నలుగురు పిల్లలు.. కొంతకాలంగా దంపతుల మధ్య విభేదాలు! అన్నీ సర్దుకుంటాయని భర్తతో కలిసి బయలుదేరిన భార్యకు అదే చివరి ప్రయాణమైంది. కలిసి జీవించేందుకు మరో అవకాశం ఇస్తే జీవితం బాగుపడుతుందనుకున్న ఆమె ఆశలు మదనపల్లెలోని ఓ లాడ్జిలోనే అంతమయ్యాయి. భార్యను హత్య చేసినట్లు చెప్పి భర్త స్వయంగా పోలీసులకు లొంగిపోవడంతో ఈ దారుణం వెలుగుచూసింది. అన్నమయ్య జిల్లాలో అక్టోబర్ 15న జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.**






కర్ణాటకలోని కోలారు జిల్లా ముళబాగల్ ప్రాంతానికి చెందిన నవీద్ బాషా (30), రూబియా తాజ్ (28) పదమూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మొదట్లో సజావుగా సాగిన దాంపత్య జీవితంలో క్రమంగా విభేదాలు తలెత్తాయి. గొడవలు తీవ్రమవడంతో కొంతకాలంగా ఇద్దరూ విడివిడిగా నివసిస్తున్నారు. కుటుంబ సభ్యులు జోక్యం చేసుకుని వారి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించారు.

ఈ నేపథ్యంలో అక్టోబర్ 14న నవీద్ భార్యను కలుసుకుని తనతో రావడానికి ఒప్పించాడు. ఇద్దరూ కలిసి షాపింగ్ చేసి సాయంత్రానికి మదనపల్లె చేరుకున్నారు. అప్పటికే ఆలస్యమైందని, మరుసటి ఉదయం బయలుదేరవచ్చని చెప్పి ఆమెను ఓ ప్రైవేట్ లాడ్జికి తీసుకెళ్లాడు. అక్కడ గది అద్దెకు తీసుకున్నారు.

అయితే తెల్లవారుజామున పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, దంపతుల మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. ఆగ్రహానికి గురైన నవీద్ భార్యపై బీరు సీసాతో దాడి చేశాడు. తలపై బలంగా కొట్టి, పగిలిన సీసా ముక్కతో గొంతుపై దాడి చేసినట్లు వార్తాకథనాలు వెల్లడించాయి. తీవ్రగాయాల కారణంగా రూబియా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

హత్య అనంతరం నవీద్ లాడ్జి నుంచి బయటకు వచ్చి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. తన భార్యను హత్య చేసినట్లు చెప్పి లొంగిపోయాడు. అతడి మాటలు విన్న పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. అతడిని అదుపులోకి తీసుకుని లాడ్జికి చేరుకున్నారు. గదిని పరిశీలించగా రూబియా రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించింది.

మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ మోహన్ కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. దాంపత్య విభేదాలే హత్యకు దారితీసి ఉండవచ్చని భావిస్తున్నప్పటికీ, అసలు కారణాన్ని ఇంకా నిర్ధారించాల్సి ఉంది. నిందితుడిని ప్రశ్నిస్తూ ఘటనకు ముందు జరిగిన పరిణామాలను పరిశీలిస్తున్నారు.

ఈ దారుణంతో నలుగురు చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. తల్లి ప్రాణాలు కోల్పోగా, తండ్రి హత్య కేసులో పోలీసుల అదుపులో ఉన్నాడు. కుటుంబ కలహాలు ఎంతటి విషాదానికి దారితీస్తాయో ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

కలిసి బతుకుదామని బయలుదేరిన ప్రయాణం.. ఒకరి మరణంతో, మరొకరి అరెస్టుతో ముగిసింది. క్షణికావేశంలో జరిగిన ఘాతుకానికి నాలుగు అమాయక జీవితాలు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది!

# నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కె.కె రాజు





**విశాఖపట్నం( జయ జయహే)**

విశాఖ ఉత్తర నియోజకవర్గం లో 57 58 వ వార్డు కార్పొరేట్ అభ్యర్థులు కేవీఎన్ శశికళ, మరియు బొడ్డేటి అనురాధ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె.కె రాజు ఈ సందర్భంగా కె.కె రాజుమాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు కొండ వాలు ప్రాంతాలును ఎంతో అభివృద్ధి చేశామని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి కుంటుపడిందని మరలా ఇక్కడ అభివృద్ధి కొనసాగాలంటే వైసిపి కార్పొరేట్ అభ్యర్థులను, మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి ని గెలిపించాలని కోరారు.. కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఇచ్చిన హామీలు ఏమీ నెరవేర్చలేదని అన్నారు...కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో భూములను పప్పు బెల్లం ల ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్నారని.స్టీల్ ప్లాంట్ అ మ్మకానికి పెట్టారని, వీళ్ళ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటే విశాఖలో వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు... ఈ కార్యక్రమంలో అల్లు శంకర్రావు, సీనియర్ నాయకులు, నీలి రవి,బొగ్గు శ్రీను, బొడ్డేటి నాగు, వార్డు అధ్యక్షుడు డోప్ప శ్రీను, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు




## స్వేచ్ఛగా నామినేషన్లు వేసేలా

# ప్రజాస్వామ్య వాతావరణం డా. పనబాక లక్ష్మి

**తిరుపతి, అక్టోబర్ 18, జయ జయహే**

తిరుపతి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా ప్రజాస్వామ్య వాతావరణాన్ని కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు, టీటీడీ బోర్డు సభ్యురాలు డా. పనబాక లక్ష్మి తెలిపారు. తిరుపతిలో జేబీ శ్రీనివాస్ నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తొలి రెండు రోజుల్లో మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులు కలిపి 273 నామినేషన్లు దాఖలయ్యాయని వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులందరూ నిర్భయంగా నామినేషన్లు వేసి ఎన్నికల్లో పోటీ చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు మానుకోవాలని, తిరుపతిలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రజలు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ జనరల్ సెక్రటరీ డాలర్స్ దివాకర్ రెడ్డి, ఎన్నికల అబ్జర్వర్ నుకసాని బాలాజీ పాల్గొన్నారు.




# వైద్య విద్య క్రీడా కోటాపై వివాదం!

## మొదటి ఫలితాల్లో పేరు ఏది?

## గంట తర్వాత పతకం ఎలా వచ్చింది?

## రోలర్ స్కేటింగ్ పోటీల ఫలితాలపై సమగ్ర విచారణకు డిమాండ్

**విశాఖపట్నం, అక్టోబర్ 18, జయ జయహే :**

వైద్య విద్య ప్రవేశాల్లో క్రీడా కోటా కింద పతకాల ఆధారంగా ప్రాధాన్యత కల్పించే అంశం వివాదాస్పదంగా మారింది. 2025లో విశాఖపట్నంలో జరిగిన 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీల్లోని పతకానికి సంబంధించి పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అందుబాటులో ఉన్న చేతిరాత ఫలితాల పత్రంలో 18 ఏళ్ల పైబడిన మహిళల విభాగంలో ప్రకటించిన ముగ్గురు పతక విజేతల పేర్లలో మనస్విని దాదీచ్ పేరు కనిపించడం లేదని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. తొలుత ముగ్గురికి పతకాలు అందించిన అనంతరం, సుమారు గంట తర్వాత మనస్విని దాదీచ్‌కు మరోసారి పతకం అందించినట్లు ఆరోపిస్తున్నారు.ఈ పతకం ప్రదానానికి అధికారిక అనుమతి ఉందా? ఫలితాలను సవరించారా? ప్రధాన న్యాయనిర్ణేత ఆమోదం తీసుకున్నారా? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.ఈ నెల 16న విడుదలైన ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ తుది సవరించిన అర్హత జాబితాలో మనస్విని పేరు ఉండటంతో, వైద్య విద్య సీట్ల కేటాయింపుపై ఈ అంశం ప్రభావం చూపే అవకాశం ఉందని ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అసలు ఫలితాల పత్రాలు, పతకాల ప్రదాన దృశ్యాలు, స్కోరింగ్ వివరాలు, ప్రధాన న్యాయనిర్ణేత నివేదికను పరిశీలించి నిష్పక్షపాత విచారణ జరపాలని వారు కోరుతున్నారు. పతకం ప్రదానంలో జరిగిన పరిణామాలపై అధికారిక వివరణ వెలువడితేనే వాస్తవాలు స్పష్టమవుతాయి.



# ప్రేమ సదన్‌లో దుర్గాదేవి, అన్నపూర్ణాదేవిగా అమ్మవారి దివ్య దర్శనం

## వైభవంగా దసరా పంచరాత్ర మహోత్సవాలు..

## భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

**విశాఖపట్నం, అక్టోబర్ 18, జయ జయహే**

ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి ప్రేమ సదన్ మందిరంలో దసరా పంచరాత్ర (ఐదు రోజుల) మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా, శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ల దివ్య దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గాదేవికి సహస్రనామార్చన, శ్రీ అన్నపూర్ణాదేవికి అష్టోత్తర పూజ, నవధాన్యాలతో అర్చన, అన్నాభిషేకం, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులు విశేషంగా ఆరాధించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. విశాఖ జిల్లా మహిళా ఆధ్యాత్మిక సమన్వయకర్త రాధా సత్యవరపు, పండితులు శ్రీ భాస్కర శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. శ్రీ సత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు, వేద పండితులు సుబ్రహ్మణ్యం, నగర సేవా సమితి సమన్వయకర్త బి. సాయికుమార్‌తో పాటు ఇతర పదాధికారులు, భక్తులు పాల్గొన్నారు. భక్తి, ఆధ్యాత్మికత వెల్లివిరిసిన మందిర ప్రాంగణంలో అమ్మవార్ల పూజలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



## 120వ డివిజన్ బరిలో పాశర్ల

# వరహా వెంకట ప్రసాద్

## సర్పంచ్‌గా అనుభవం..

## సింహాచలం పాలక మండలి సభ్యుడిగా సేవలు

## అడవివరం భూముల పరిరక్షణ ఉద్యమంలో కీలక పాత్ర!

**మధురవాడ:**

గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ) ఎన్నికల నేపథ్యంలో 120వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా పాశర్ల వరహా వెంకట ప్రసాద్ నామినేషన్ దాఖలు చేశారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావుకు ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాశర్ల వసంత కళ్యాణి, న్యాయవాది పాలవలస రాంబాబు పాల్గొన్నారు. అడవివరం మాజీ సర్పంచ్‌గా గ్రామస్థాయి పాలనలో అనుభవం సంపాదించిన పాశర్ల వరహా వెంకట ప్రసాద్, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. స్థానిక సమస్యలపై అవగాహనతో పాటు ప్రజలతో అనుబంధం కలిగిన నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. ప్రస్తుతం అడవివరం భూములకు సంబంధించిన సమస్యలపై ఆయన ఉద్యమం కొనసాగిస్తున్నారు. భూముల అంశంపై స్థానికుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తున్నారు. ప్రజా సమస్యలపై పోరాటం, గతంలో నిర్వహించిన పదవుల్లో అనుభవాన్ని అస్త్రాలుగా చేసుకుని 120వ డివిజన్ ఎన్నికల బరిలోకి దిగారు. నామినేషన్ దాఖలుతో డివిజన్ రాజకీయాల్లో ఎన్నికల సందడి మొదలైంది. ప్రజా సమస్యల పరిష్కారం, స్థానిక అభివృద్ధి, అడవివరం భూముల అంశంపై ఆయన పోరాటం ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.



## జంగమ సంక్షేమ సంఘం

# కార్యవర్గ సమావేశం

**శ్రీకాళహస్తి, (జయ జయహే )**

శ్రీకాళహస్తిలోని జంగమ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం స్థానిక సంతమైదానంలోని గురుమందిరంలో సంఘం అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సంఘం కమిటీలోకి కొత్తగా ఒకరిని సహ కార్యదర్శిగా, మరో ముగ్గురిని కమిటీ సభ్యులుగా నియమించుకోవాలని నిర్ణయించారు. అలాగే కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించారు. 2027లో శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శ్రీకాళహస్తి జంగమ సంక్షేమ సంఘం తరఫున ఉభయం నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులతో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## కాలువ ఆక్రమణతో

# కాటూరుకు సాగునీటి ఎద్దడి.. వరద ముప్పు!

## శాశ్వత వంతెన

## నిర్మించాలని రైతుల డిమాండ్

**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబర్ 18, జయ జయహే**

బుచ్చినాయుడు కండ్రిగ మండలం కాటూరు గ్రామంలో ప్రధాన కాలంగి కాలువ ఆక్రమణ రైతులకు ఇబ్బందిగా మారింది. గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న కాలువకు కొందరు వ్యక్తులు అడ్డంగా సిమెంట్ పైపులు వేసి మట్టితో పూడ్చివేయడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. దీంతో గ్రామంలోని రెండు ప్రధాన చెరువులకు నీరు చేరక సాగునీటి సమస్య తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భారీ వర్షాలు కురిస్తే వరద నీరు వెళ్లేందుకు మార్గం లేక గ్రామం, పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి కాలువకు అడ్డంగా ఉన్న సిమెంట్ పైపులు, మట్టి పూడికలను తొలగించాలని కోరుతున్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా, నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా ప్రభుత్వ నిధులతో శాశ్వత వంతెన నిర్మించాలని కాటూరు గ్రామ రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




# ఆకివీడు వైసీపీ అభ్యర్థిగా మన్నే లలితాదేవి నామినేషన్

## ఉండి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మంతెన యోగీంద్రకుమార్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం

**ఆకివీడు, అక్టోబర్ 18, జయ జయహే**

ఆకివీడు నగర పంచాయతీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మన్నే లలితాదేవి నామినేషన్ దాఖలు చేశారు. ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మంతెన యోగీంద్రకుమార్ (బాబు) ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆమె ఆదివారం నామినేషన్ కార్యక్రమం నిర్వహించారు.మన్నే లలితాదేవికి రాజకీయంగా విశేష అనుభవం ఉంది. గతంలో సర్పంచ్‌గా, జెడ్పీటీసీ సభ్యురాలిగా, జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్‌గా, ఆకివీడు నగర పంచాయతీ కో-ఆప్షన్ సభ్యురాలిగా ఆమె వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఆమె భర్త మన్నే పోతురాజు కూడా గతంలో ఆకివీడు సర్పంచ్‌గా, వార్డు సభ్యుడిగా, జెడ్పీటీసీ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు. రాజకీయ అనుభవం, ప్రజాసేవలో పరిచయం ఉన్న లలితాదేవిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎంపిక చేయడంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. నామినేషన్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆమెకు మద్దతు తెలిపారు.



## హార్ట్ ప్రాబ్లమ్స్ రాకుండా ఉండాలంటే...

### వీటికి దూరంగా ఉండండి

**గుండె ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కొన్ని ఫుడ్స్ తీసుకోవాలి. మరికొన్ని ఫుడ్స్‌ని అసలే తీసుకోవద్దు. దీని వల్ల చెడు కొలెస్ట్రాల్ పెరిగి గుండె సమస్యలకి కారణమవుతుంది. అందుకోసమే కొన్ని ఫుడ్స్ తీసుకోవడాన్ని తగ్గించాలి. అలాంటి ఫుడ్స్ ఏంటో తెలుసుకోండి.**

**శాచ్యురేటెడ్ ఫ్యాట్స్..**
ఈ ఫ్యాట్స్‌నే చెడు కొలెస్ట్రాల్ అంటారు. దీనిని తీసుకోవడం వల్ల మీ బాడీలో చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది. పేస్ట్రీలు, బిస్కెట్స్ వంటి ప్రాసెస్డ్ ఫుడ్స్ తీసుకోవద్దు. మీట్‌ని తీసుకోవడాన్ని తగ్గించాలి. వీటితో పాటు ఫ్రైడ్ ఫుడ్స్, చిప్స్, బేక్డ్ ఫుడ్స్, మైదాతో తయారైన ఫుడ్స్ తీసుకోవద్దు.

**గుండెపోటు ముందు కనిపించే లక్షణాలు..**

**షుగర్ ఫుడ్స్..**
షుగర్ ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ లెవల్స్ పెరుగుతాయి. బరువు పెరుగుతారు. దీని వల్ల ఆటోమేటిగ్గా గుండెపై ఎఫెక్ట్ పెడుతుంది. కాబట్టి, వీటిని తీసుకోవద్దు.

**సోడియం..**
మనం తీసుకునే ఫుడ్స్‌లో సోడియం ఎక్కువగా ఉంటే గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, ఏవైనా ఫుడ్స్ తీసుకున్నప్పుడు సోడియం కంటెంట్ తక్కువగా ఉండేలా చూసుకోండి.

**కూల్‌డ్రింక్స్..**
కూల్ డ్రింక్స్‌లో కూడా షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల బరువు పెరుగుతారు. గుండెకి కూడా మంచిది కాదు. కాబట్టి, కూల్ డ్రింక్స్‌ని తీసుకోవద్దు. ఇవే కాదు.. పండ్లతో తయారైన జ్యూస్ కూడా తాగొద్దు. ఇందులో ఎక్కువగా షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ప్యాకేజ్డ్ డ్రింక్స్ తాగొద్దు. వీటి వల్ల కూడా షుగర్ తీసుకున్నట్లే అవుతుంది.

**ఆల్కహాల్..**
ఆల్కహాల్ తీసుకోవడం వల్ల కూడా గుండె సమస్యలు వచ్చే రిస్క్ పెరుగుతుంది. కాబట్టి, ఆల్కహాల్ తీసుకోవడాన్ని తగ్గించాలి.

**కెఫిన్ డ్రింక్స్..**
కెఫిన్ ఎక్కువగా ఉండే డ్రింక్స్ కూడా గుండెకి అంత మంచివి కావు. వీటిని తీసుకోవడం వల్ల గుండెపై ఎఫెక్ట్ పడుతుంది. కాఫీ వంటివి తీసుకున్నా మోతాదులోనే తీసుకోవాలి.

# ఇల్లు ఊడ్చి, చక్కగా తుడిచే రోబో క్లీనర్

## మీరు చెప్పినట్టు వింటుంది




**ప్రతిరోజు ఇల్లు ఊడిచి, తడిగుడ్డ వేసి అలసిపోతున్నారా. అయితే మీరు వీటి గురించి తెలుసుకుని తీరాల్సిందే. ఇవి మీకు శ్రమ లేకుండా ఇంటిని సూపర్ ఫాస్ట్‌గా శుభ్రం చేసేస్తాయి. అంతేకాదు ఇంటిలోని ప్రతి మూలను మెరిపిస్తుంది. ఇంతకీ అవి ఏంటో ఈ స్టోరీలో చూద్దాం..**

మహిళలకు వంట పని తర్వాత ఇబ్బంది కలిగే పని అంటే ఇళ్లు క్లీనింగ్. ఎందుకంటే ఇల్లు ఊడ్చి తడిగుడ్డ పెట్టాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని. సోఫా కింద, మంచం కింద, బీరువాల కింద వంగి ఊడవాలన్నా, తడిగుడ్డ పెట్టాలన్నా చాలా కష్టం. ఇక ప్రస్తుతం ఉన్న బిజీ లైఫ్‌లో ఒక పక్క ఉద్యోగాలు చేసుకుంటూ.. మరో పక్క పిల్లల్ని చూసుకోవడం, ఇంటి పనులు చేయడం అంటే పని భారం మామూలుగా ఉండదు. పని చేసే ఓపిక ఉన్నా సమయం ఉండదు. ఒక్కోసారి సమయం ఉన్నా.. పనులు చేసేందుకు ఓపిక ఉండదు. అయితే వీటన్నింటికి చెక్ పెట్టేందుకు మీకోసం ఒక అద్భుతమైన ప్రొడక్ట్ వచ్చేసింది. అదే “రోబో వ్యాక్యూమ్ క్లీనర్”. మీరు రిమోట్‌తో ఆపరేట్ చేస్తే చాలు.. దాని పని అది చేసుకుంటుంది. అసలు ఇది ఎలా పనిచేస్తుంది?

బట్టలు ఉతకడానికి వాషింగ్ మెషీన్లు, గిన్నెలు శుభ్రం చేయడానికి డిష్ వాషర్లు, ఇంటిని శుభ్రం చేయడానికి వ్యాక్యూమ్ క్లీనర్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఆల్‌రెడీ వాక్యూమ్ క్లీనర్లు ఉన్నాయి కాదా.. మళ్లీ ఈ రోబో క్లీనర్లు ఎందుకూ అనే డౌట్ మీకు రావచ్చు. అయితే వ్యాక్యూమ్ క్లీనర్లను మనం ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. అలాగే ఇంట్లోని దుమ్ము, చెత్తను తొలగించడానికి మాత్రమే అవి ఉపయోగపడతాయి. ఆ తర్వాత ఇళ్లు తుడవాలంటే మాప్‌లు ఉపయోగించాల్సిందే. అదే ఈ రోబో వాక్యూమ్ క్లీనర్ ఆటోమేటిక్‌గా పనిచేస్తుంది. ఇది కూడా ఇంట్లోని దుమ్ము, చెత్తను తొలగించడానికి ఉపయోగపడుతుంది. అంతేకాకుండా వీటిలోని పలు మోడల్స్ ఇల్లు ఊడ్చేసి తడిగుడ్డ కూడా పెట్టేస్తాయి.

**ప్రయోజనాలు చూస్తే:**

ఆటోమెటిక్‌గా శుభ్రం చేయడం: సాధారణంగా వ్యాక్యూమ్ క్లీనర్ల వెంట మనం ఉండాల్సిందే. కానీ వీటికి మనం వెంట ఉండనవసరం లేదు. జస్ట్ ఆన్ చేస్తే చాలు ఇవి స్వయంగా ఇంటిని శుభ్రం చేస్తాయి.

అన్ని రకాల నేలలపై పని చేస్తాయి: కార్పెట్లు, టైల్స్, లామినేట్ ఫ్లోరింగ్ వంటి అన్ని రకాల నేలలపై ఇవి సమర్థవంతంగా పని చేస్తాయి.

చెత్తను సేకరించడం: చిన్న చిన్న ముక్కలు, జుట్టు, బిస్కెట్ ముక్కలు ఇలా ఒక్కటేమటి అన్ని రకాల చెత్తను సులభంగా సేకరించి అందులోనే స్టోర్ చేసుకుంటాయి. తర్వాత దాని నుంచి చెత్తను తీసివేస్తే సరి.

షెడ్యూల్ చేయడం: మనం నచ్చిన సమయంలో ఆటోమేటిక్‌గా శుభ్రం చేయడానికి షెడ్యూల్ చేయవచ్చు.

అధునాతన ఫీచర్లు: కొన్ని రోబో వాక్యూమ్ క్లీనర్‌లలో మ్యాపింగ్, వాయిస్ కమాండ్‌లు, అప్లికేషన్ కంట్రోల్ వంటి అధునాతన ఫీచర్లు ఉంటాయి.

శత్రువులను ఖతం చేసే AI రోబో'– ఎనిమీ ఎక్కడ ఉన్నా గురితప్పదు! యుద్ధభూమిలో 360 డిగ్రీల కవరేజ్!

**ఎలా ఆపరేట్ చేయాలి:**

ముందుగా ఛార్జింగ్ పెట్టాలి. ఆ తర్వాత బటన్ ప్రెస్ చేస్తే ఆన్ అవుతుంది. లేదా రిమోట్ ద్వారా కూడా ఆపరేట్ చేయవచ్చు.

కొన్ని క్లీనర్లకు మొబైల్ యాప్ ద్వారా ఆదేశాలు ఇవ్వొచ్చు.. మరికొన్ని వాయిస్ కమాండ్ ద్వారా ఆపరేట్ చేయొచ్చు.

ఫోన్లో యాప్ ద్వారా టైమ్ సెట్ చేస్తే చాలు.. ప్రతిరోజూ ఆ టైమ్ ప్రకారం వాటంతటవే పని చేస్తాయి.

మనం ఇంట్లోలేకున్నా వాటిని ఆపరేట్ చేయొచ్చు.

అలాగే వాటిని ఉపయోగించేటప్పుడు క్లీనింగ్ మోడ్‌లను ఎంచుకోవచ్చు. అంటే..

ఆటో మోడ్: క్లీనర్ స్వయంగా ఇంటిని స్కాన్ చేసి క్లీన్ చేస్తుంది.

స్పాట్ క్లీనింగ్: ఒక నిర్దిష్ట ప్రాంతాన్ని క్లీన్ చేయడానికి ఈ మోడ్ ఆన్ చేయాలి.

ఎడ్జ్ క్లీనింగ్: గోడల వెంబడి క్లీన్ చేయడానికి.

షెడ్యూల్ క్లీనింగ్: ముందే నిర్ణయించిన సమయం ప్రకారం క్లీనర్ స్వయంగా ఆన్ అవుతుంది. పని చేస్తూ వెళు ుంది.

మీకు కావాల్సిన క్లీనింగ్ మోడ్‌ను ఎంచుకున్న తర్వాత.. స్టార్ట్ బటన్ లేదా యాప్/రిమోట్ ద్వారా ఆన్ చేస్తే క్లీనర్ తన పనిని ప్రారంభిస్తుంది.

క్లీనింగ్ పూర్తయిన తర్వాత.. అది ఆటోమెటిక్‌గా ఛార్జింగ్ డాక్‌కు తిరిగి వెళుతుంది. ఆ తర్వాత పవర్ ఆఫ్ చేస్తే సరి. కొన్ని క్లీనర్స్ ఆటోమెటిక్‌గా అవే ఆఫ్ అయిపోతాయి.

ఎక్కడ లభిస్తాయి?: ప్రస్తుతం ఈ రోబో వ్యాక్యూమ్ క్లీనర్లు ప్రముఖ ఈ–కామర్స్ సంస్థలలో అందుబాటులో ఉన్నాయి. ఫీచర్స్‌ను బట్టి ధరలు ఉంటాయి. అలాగే ప్రముఖ కంపెనీలు వీటిపై ఆఫర్స్ కూడా ప్రకటిస్తున్నాయి. యంత్రాల్లా ఉండే వీటిల్లో ఇంటి అవసరాల్ని బట్టి మనకు కావలసినదాన్ని ఎంచుకోవచ్చు, పనుల భారాన్ని తగ్గించుకోవచ్చు.

## ఈ రూల్స్ ఫాలో అయితే

# ఎవరైనా సక్సెస్ అవుతారు



**ప్రతి ఒక్కరి జీవితంలో రోజుకి 24 గంటలే ఉంటాయి. ప్రతి ఒక్కరికీ ఉండేవి అదే రాత్రి, అదే పగలు. కానీ, కొంతమంది జీవితంలో సక్సెస్ అయితే, మరికొంతమంది మాత్రం లైఫ్‌ని భారంగా భరిస్తుంటారు. దీనికి కారణాలు.. లైఫ్‌ని మార్చేందుకు కొంతమంది కొన్ని రూల్స్ ఫాలో అయితే, మరికొంత మంది వారికి నచ్చింది చేసుకుంటూ పోతారు. అసలు జీవితంలో సక్సెస్ కావాలంటే ఏం చేయాలో తెలుసుకోండి.**

**నేర్చుకోవడం..**
ఏదైనా విషయాన్ని నేర్చుకోవడాన్ని ఆపొద్దు. ప్రతిరోజూ ప్రపంచంలో కొత్త అప్‌డేట్స్ వస్తూనే ఉంటాయి. అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. కాబట్టి, ఎప్పటికప్పుడు కొత్త విషయాలు, ట్రెండ్స్ నేర్చుకోవడం, తెలుసుకోవడం ముఖ్యం.

**నమ్మడం..**
మిమ్మల్ని, మీ సామర్థ్యాలని నమ్మాలి. మీపై మీకే నమ్మకం లేకపోతే మరెవరూ నమ్మతారు. మీ గోల్స్ సాధించే వరకూ మీ సామర్థ్యాన్ని నమ్మి పనులు చేయండి.

**పోల్చుకోవడం..**
ప్రతి ఒక్కరి జీవితాలు వేర్వేరుగా ఉంటాయి. అందుకని, మనం ఇతరులతో పోల్చుకుని మన జీవితతాన్ని తక్కువ చేయొద్దు. మనకున్న టాలెంట్‌ని గుర్తించి వాటిని ఇంకా మెరుగ్గా చేసుకుని సక్సెస్ అయ్యేందుకు ఏం చేయాలో వాటిపై దృష్టిపెట్టాలి.

**కలల సాకారం కోసం..**
ప్రతి ఒక్కరి జీవితంలో చాలా కలలు ఉంటాయి. వాటిని సాకారం చేసుకోవాలంటే ముందుగా కనే కలలు ఎంత అసాధ్యమని అనిపించినా వాటిని వదులుకోవద్దు. కష్టపడి ఇష్టపడి వాటిని అచీవ్ చేసేందుకు కష్టపడుతూనే ఉండాలి. అల వదలకుండా ప్రయత్నిస్తే ఎప్పటికైనా ఆ కల సాకారమవుతుంది.

**క్రియేట్ చేయడం..**
మీరు ఏదైనా కొత్తవి క్రియేట్ చేయండి. అందరి దారిలో మీరు వెళ్ళకుండా మీకంటూ గుర్తింపు ఉండేలా ఏదైనా విషయాన్ని క్రియేట్ చేస్తే అదే మీ సక్సెస్‌కి కారణమవ్వొచ్చు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com